# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి
మిస్.పి. ఇందిరాదేవి
జి.ఎస్.ఆర్. మూర్తి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 30 Issue 1
No.of Pages 44
SEPTEMBER 2010

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by
C.V. Ramana Babu,
on behalf of
YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at
D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,

**ఈ సంచికలో....** **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| ప్రణవస్వరూపుడు గణనాధుడు | 5 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీఅభిభాషణ | 9 |
| సన్నిధిలోసంభాషణ | 12 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 13 |
| సత్సంగసౌరభం | 15 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 17 |
| శ్రీకృష్ణతత్వము, ప్రేమయోగము | 20 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 22 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 24 |
| మాతాజీ బోధామృతం | 26 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 28 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 30 |
| సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర | 32 |
| ప్రయాణకాలే z పిచ మాం | 35 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 37 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 42 |

# భద్రవాక్యం

**శ్లో॥ భ్రాన్తం దేశమనేక దుర్గవిషమం ప్రాప్తం న కించిత్ఫలం,**
**త్యక్త్వా జాతి కులాభిమాన ముచితం సేవా కృతా నిష్ఫలా,**
**భుక్తం మానవివర్జితం పరగృహేష్వా శంకయా కాకవ,**
**తృష్ణే ! జృమ్భసి పాపకర్మపిశునే నాద్యాపి సంతుష్యసి.**

-భర్తృహరి సుభాషితము

**చ॥ విసికితి దుర్గ దుర్విషయ విభ్రమయుక్తిఁ, గులాభిమానమున్**
**బస చెడ సేవ చేసితి, విపన్నుడనై పర గేహసీమ వా**
**యసమువలన్ భుజించితిఁ, బ్రయత్నము నిష్ఫలమై నశించె, సం**
**తసపడ వుగ్రకర్మపిశునత్వము చూపెద వాశ, యేటికిన్ ?**

సర్వ అనర్థాలకు మూలము ఆశ. అంతులేని కోరికలు తీర్చుకోవలెననే ఆశ. కోరికలు తీర్చుకొనేందుకు మానవుడు ఏ స్థితికైనా దిగజారతాడు. ఏదైనా చేయటానికి సిద్ధపడతాడు. ఒక కోరిక తీరిక తీరితే ఇంకొకటి.

ఇలా గొంతెమ్మ కోరికలు తీర్చుకోవటానికివెళ్ళరాని ప్రదేశాలకు వెళ్ళాను. కులాభిమానము వదలి సేవలు చేశాను. తిరిగి తిరిగి పర గృహములలో ఏది దొరికితే అది కాకి వలె తిన్నాను. నా ప్రయత్నాలన్నీ నిష్ఫలమైనాయి. కోరికలు తీరలేదు. దురాశ వదలలేదు. క్రూరకర్మలను చేసి అనేక కష్టాలపాలైనాను. అయినా ఆశ వదలలేదు.

భగవత్ ప్రాప్తి పొందలేక మానవుడు జీవితాన్ని వ్యర్థం చేసికొంటున్నాడు కోరికలే దీనికి మూల కారణం. కోరికలు తీర్చుకొనేటప్పటికి ఆయువు క్షీణించిపోతుందన్న విషయం మరవకూడదు. కోరికలను అదుపులో పెట్టాలి.. అశుద్ధమైన వాటిని పక్కకు నెట్టి మనస్సును శుద్ధమైన కోరికలతో నింపాలి. కోరికలను తగ్గిస్తూపోవాలి. అప్పుడు మనస్సు నిర్మలమౌతుంది. అందులో భగవంతుడు ప్రకాశిస్తాడు.

ఓ మనస్సా! ప్రాపంచిక విషయాలపై విముఖత చూపు. నీ మనస్సును భగవంతుని వైపు తిప్పు. విరాగివికా. నీవు బంధముక్తుడవే. కాని కోరికలచే బంధింపబడుతున్నావు.ఏ విధంగా ఒక కోతి అత్యాశవల్ల బోయవానికి చిక్కినదో శ్రీసద్గురుబోధాశ్రవణము వలన తెలిసికొంటిమి కదా! భగవంతుణ్ణి పొందగోరేవాడు కామినీ కాంచనాల వలలో పడకుండా అతి జాగరూకుడై మెలగాలి. లేకుంటే ఎన్నటికీ సిద్ధి పొందలేడు. *

## అమ్మ ఆశీస్సులు

**కరారవిందేన పదారవిందం, ముఖారవిందేన వినివేశయంతం।**
**వటస్య పత్రస్య పుటే శయానం, బాలం ముకుందం మనసా స్మరామి॥**

వటపత్రంపై శయనించి తన కాలి బొటనవేలిని చేతితో తన నోట్లో పెట్టుకొన్న బాల ముకుందుని మనసారా స్మరిస్తున్నాను - అని ఈ శ్లోకానికి అర్థం.అయితే శ్రీ గురుదేవులు మనకు ఏమని అందించారంటే,

వటపత్రశాయిరైు పసిబాలునటు తోచుభుజగ శయనుడై
పురుషోత్తముడె యగును।

పత్రమా, అది భుజంగమా? బాలుడందుమా, పరమాత్ముడందుమా?

వటపత్రం పై పవ్వళించి ఒక్కొక్కసారి పసిబాలుని వలె,మరోసారి భుజగ శయనుడై పురుషోత్తముని వలె తోచే ఆ అవతార పురుషుని లీలలను ఎవరు తెలియగలరు? ఎలా తెలియగలరు? ఆ బాలుడే లోకోద్ధరణకై అవతరించి వచ్చిన మన బాబుని ఎలా తెలుసుకోవటం? " అమ్మా! ఆకలిగా ఉంది పాలు ఇవ్వు" అన్న కృష్ణునితో "రాత్రి అవనియ్యి నాయనా ఇస్తాను" అని యశోద అంటే, వెంటనే కళ్ళు రెండూ గట్టిగా మూసికొని "రాత్రి అయింది పాలు త్వరగా ఇవ్వు" అనే బాలుని హటాన్ని ఎలా అర్థంచేసికోవటం? కృష్ణుని చూడాలని తీవ్ర ఆవేదన చెందుతున్న ఒక గోపిక ఇంట ఆమె లేనప్పుడు అతడు ప్రవేశించి కుండలో చెయ్యి పెట్టివెన్నను కెలుకుతున్న ఆ బాలుని గుర్తించలేక "ఏమిటి వెన్న అలా కెలుకుతున్నావు? అంటే "మా ఇంట ఒక లేగదూడ తప్పిపోయింది. ఈ కుండలో ఉన్నదేమో అని చూస్తున్నాను" అని సమాధానం ఇచ్చాడు. ఆ గోపిక "ఆ కుండలో లేగదూడ ఎందుకు ఉంటుంది?" అంటుంది. "అంతేలే అసలు వస్తువు దగ్గర పెట్టుకొని ఊరంతా వెతుకుతారు" అన్న బాలునిఅప్పుడు శ్రీ కృష్ణునిగా గుర్తించింది ఆ గోపిక. ఆయన మనకు అర్థం అవుతాడా? అంటే ఆయన చెప్పింది తు.చ తప్పుకుండా చెయ్యాలి.అప్పుడే ఆయన ఏమిటో తెలుసుకోగలుగుతాం. శ్రీకృష్ణ జన్మాష్టమివేడుకలు జరుపుకొన్న తరువాత వినాయక చవితినాడు ప్రణవస్వరూపుడైన గణపతిని భక్తి ప్రపత్తులతో పూజించుకొంటాము.

సర్వదేవస్వరూపులైన గురుదేవులు మనందరికీ అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, ఆత్మానుభూతిని ప్రసాదించెదరుగాక! సుఖీభవ! సుఖీభవ!!

- మీ అమ్మ

# సంపాదకీయం

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్॥**
**ధర్మ సంస్థాపనార్థాయ సమ్భవామి యుగే యుగే॥**

'సాధు రక్షణకు, దుష్ట శిక్షణకు ధర్మ సంస్థాపన చేయుటకు యుగ యుగముల యందు జన్మిస్తాను' అని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పియున్నాడు. దేవకీ వసుదేవులకు పుట్టి వ్రేపల్లె చేరిన ఆ బాలుడు ఎందరో రాక్షసులను సంహరించాడు. అంత గోకులంలోనివారంతా సంబరాలు చేసికొన్నారు. నంద యశోదలు ఎన్నెన్నో కానుకలు, మణులు, హారాలు అందరికీ పంచిపెట్టారు. ఋషి మునులందరూ సంతోషించారు. శ్రీకృష్ణుడు పుట్టిన సందర్భంగా జన్మాష్టమి పర్వదినం మనం ఎంతోఘనంగా జరుపుకొన్నాం.

జూలై 28నుండి ఆగస్టు 1 వ తేది వరకు భాగ్యనగరంలో జరిగిన సామూహిక పూజలు, సత్సంగ కార్యక్రమాలు దివ్యంగా, భవ్యంగా ముగిశాయి.

శ్రీకాళీ వర ప్రసాద్‌బాబు ట్రస్ట్ హాస్పటల్ ప్రాంగణంలో ఒక భవ్య మందిర నిర్మాణం జరిగింది. ఆ మందిరంలో పంచలోహములతో చేయబడిన శ్రీ సద్గురుదేవుల మూర్తి ప్రతిష్ట ఆగస్టు 16వ తేదీన జరిగింది. భవరోగ భిషగ్వరుడైన శ్రీ సద్గురుదేవులు అందరినీ భవరోగాలనుండి ముక్తులను చేసి ఆధ్యాత్మిక మార్గంలో నడిపి సుఖ శాంతులను ప్రసాదించెదరు గాక అని శ్రీ మాతాజీ భక్తులందరికీ తమ ఆశీస్సులను అందించారు.

ది 5న శ్రీ కాళీవర ప్రసాద్‌బాబు ట్రస్ట్ గురుకులంవారు ఏర్పర్చిన సభలో శ్రీ మాతాజీ ఉపాధ్యాయులనందరినీ సన్మానించారు.

ది.11 - వినాయక చవితి -ఈనాడు మహారాష్ట్రలో వాడ వాడలలో,వీధి వీధులలో, ప్రజలందరూ కుల, మత భేదాలను వీడి శ్రీ బాల గంగాధర తిలక్ ఏర్పర్చిన సామూహిక పూజలలో ఏకత్రితమై, ఆయన నేతృత్వంలో స్వాతంత్ర సమరంలో పాల్గొని, అనేక త్యాగాలు చేసి దేశభక్తులుగా రాణించారు. మనందరం కూడ శ్రీకోదండరామస్వామి ఆలయంలో సమావేశమై వినాయకుని సామూహిక పూజలు చేసికొని శ్రీ గురుదేవుల అనుగ్రహానికి పాత్రులమగుదాము.

మనందరికీ శ్రీ గురుదేవులు అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములు, ఆత్మానందము ప్రసాదించెదరు గాక ! అని ప్రార్థిస్తున్నాను.

- గౌరవ సంపాదకుడు

# ప్రణవస్వరూపుడు గణనాథుడు



గణపతి ఓంకార స్వరూపుడు. 'గ' అంటే బుద్ధి. 'ణ' అంటే జ్ఞానం. ఆయన సర్వ గణములకు అధిపతి అందుకే ఆయనను వినాయకుడు అని పిలుస్తారు.ఈయన ఏకదంతుడు. గజముఖుడు, పాశము, అంకుశము, అభయము,వరదముద్ర ధరించిన చతుర్భుజుడు. శూర్పకర్ణుడు.

భారతదేశం అంతటా వర్ణబేధం లేకుండా భాద్రపద శుద్ధ చవితినాడు వినాయకుని పూజించటానికి మట్టితో ప్రతిమను తయారు చేసికొని, ఆవాహనము చేసి, షోడశోపచారములతో పూజించి, స్వామికి ఇష్టమైన కుడుములు, ఉండ్రాళ్ళను నివేదన చేస్తారు. తరువాత గణపతి వ్రతకధను చదువుతారు. కథాక్షతలను శిరస్సును దాల్చిన తరువాతే చవితి చంద్రుని చూడటం ఆచారం. కార్యసిద్ధికి, అపనిందలు రాకుండా ఉండటానికి ఈ వ్రతాన్ని ఆచరించి అక్షతలను శిరస్సుపై వేసికొంటారు.

వినాయక వ్రతానికి ఎక్కువ పువ్వుల అవసరం లేదు. పత్రాలతోనే సంతుష్టి చెందుతాడు. ' ఏక వింశతి పత్ర పూజ' అని ఆరోగ్య రక్షణ కోసం చెప్పబడిన ఆకులతో పూజ చేస్తారు.

ఏ యాగం తలపెట్టినా, ఏ శుభకార్యం తలపెట్టినా విఘ్నాలు ఏవీ రాకుండా ముందుగా గణపతి పూజ చేస్తారు.

పురాణ తత్వ శాస్త్రజ్ఞుల అంచనాల ప్రకారం భారతదేశంలోనే కాక బర్మా, థాయ్‌లాండ్, కంబోడియా,పర్షియా, టిబెట్టు, మంగోలియా, చైనా, జపాన్ ,మెక్సికో మొదలైన దేశాలలోకూడా గణపతిపూజ జరిగేది. మన దేశంలో పలుచోట్ల మట్టితో పెద్ద వినాయకమూర్తులను చేసి గణపతి నవరాత్రములు(తొమ్మిది రోజులు) వైభవోపేతంగా చేస్తారు.

శ్రీకాళీవనాశ్రమంలో గణపతి స్వరూపులైన శ్రీగురుదేవులకు పూజ చేస్తారు. భక్తులందరూ మృణ్మయమూర్తులకు ప్రాణ ప్రతిష్ట చేసి గణపతిని అర్చించుకొంటారు. వ్రతకథాశ్రవణం చేస్తారు, శ్రీ మాతాజీ వారు పూజాక్షతలను భక్తులపై చల్లి తమ ఆశీస్సులను అందజేస్తారు. *

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్



"అయ్యో నా తెలివి మండిపోను! ఏమీ అడగకుండా ఊరుకున్నా బాగుండేది. మరి కాసేపు ఆ కమనీయాకృతితో నా కన్నులకు విందు చేసుకునేవాణ్ణి" అనుకుంటూ లోపలికి కృష్ణయ్య వెళ్ళిన వైపు నుంచి చూపులను మరల్చుకోలేక నిలబడి పోయాడు మన పండితుడు. అంతలో "స్వామీ! దయచేయండి" అంటూ యశోదమ్మ వచ్చి, ఆయన్ను ఎంతో ఆదరంతో ఆహ్వానించి ఉచితాసనంపై కూర్చోమని, మీగడపాలు తెచ్చి యిచ్చి, విసనకర్రతో విసురుతూ నుంచుంది. "ఆ! ఏమి లేదమ్మా! ఇటువైపు వెడుతూ, నందకుమా... అదే అదే! నందగోపుని చూచి పోదామని వచ్చాను" అని నాలిక కొరుక్కుంటూ అన్నాడు ప్రచండ పండితుడు. "మహాభాగ్యం స్వామీ! వారు అలా పనిమీద వెళ్ళారు. తమరు ఆ గదిలో విశ్రాంతి తీసుకోండి. నేను తమకు భోజనం..." అనేసరికి "ఫరవాలేదు, ఎందుకు లెండి" అని నసిగాడు పండితుడు. "పోనీ తమకు స్వయం పాకం ఏర్పాటు చేస్తాను. తమరు స్వయంగానే భోజనం తయారు చేసుకోండి" అంది. సరేనన్నాడు పండితుడు.

భగవానుడు ఉన్న యింట్లో లోటేముంది? ఆ పండితుడికి ప్రత్యేకంగా ఒక గది అన్ని సౌకర్యాలతోనూ అమర్చి, వంటకు కావలసిన అన్ని పదార్థాలు, సామగ్రి ఏర్పాటు చేసింది యశోదమ్మ. స్నానం చేసి, షడ్రసోపేతమైన పదార్థాలన్నీ వంట చేసుకున్నాడు పండితుడు. పెద్ద అరిటాకు వేసుకుని అన్నీ వడ్డించుకుని కూర్చుని, "ఓం కేశవాయస్వాహా, నారాయణాయస్వాహా, మాధవాయస్వాహా" అని ముమ్మారు ఆచమనం చేసేసరికి ఘల్లుఘల్లుమని గజ్జెలమోతతో పిలిచారా అండి?" అంటూ కృష్ణయ్య వచ్చి ఎదురుగా నుంచున్నాడు. పరమాత్మ ఎదురుగా నుంచున్నా, బ్రాహ్మణత్వం జ్ఞాపకం వచ్చిన పండితుడు "అయ్యో! యశోదమ్మా! మీ పిల్లవాడు..." అని కేకపెట్టాడు. యశోదమ్మ పరుగున వచ్చి "కన్నయ్యా! అల్లా బ్రాహ్మణులు భోజనం చేసే చోటికి మనం వెళ్ళకూడదు నాయనా!" అని "క్షమించండి స్వామీ! పిల్లవాడి

చిలిపితనం వల్ల మీ శ్రమ అంతా వృధా అయింది. ఏమనుకోకండి. పదార్థాలన్నీ యిస్తాను, మళ్ళీ వంట తయారు చేసుకోండి" అని మళ్ళీ ఏర్పాట్లు చేసింది. కన్నయ్యను ఉయ్యాలలో పరుండబెట్టి "జో జో నందబాల! జోజో గోపీలోల!.. బూచి వాడు యిందె పొంచినాడురా!" అని జోలపాడింది. బూచివాడు ఆయనకా! ఆయనే నిద్రపోతే లోకాలన్నీ గోవిందా!

పండితుడు మళ్ళీ వంట చేసుకున్నాడు. యశోదమ్మను పిలిచి "తల్లీ! ఈసారి పిల్లవాడు ఇక్కడికి రాకుండా చూసుకో అమ్మా!" అన్నాడు. "లేదులెండి, పిల్లవాణ్ణి నిద్రపుచ్చాను. మీరు హాయిగా భోజనం చెయ్యండి" అంది యశోదమ్మ. పండితుడు వడ్డించుకుని కూర్చుని ఓం "కేశవాయస్వాహా...." అని ఆచమనం చేసేసరికి మళ్ళీ కృష్ణయ్య వచ్చి ఎదురుగా నుంచున్నాడు. "యశోదమ్మా! మీ పిల్లవాడు మళ్ళీ వచ్చాడమ్మా!" అని కేకపెట్టాడు పండితుడు. యశోదమ్మ ముందు పడక గదిలో చూసింది. నిద్రపోతూనే ఉన్నాడు కన్నయ్య. ఆమె పండితుడున్న గదిలోనికి వచ్చింది. పండితుడికి ఎదురుగా నవ్వుతూ నుంచొని ఉన్న కన్నయ్యను చూసి "ఇదేమిటి? ఇప్పుడే ఉయ్యాలలో నిద్రపోతున్న వాణ్ణి చూసి యిలా వచ్చాను. ఇంతలో ఇక్కడికెలా వచ్చాడు?" అంది. పండితుడికి అర్థంగాక "మీకు కవలపిల్లలా?" అని యశోదమ్మను అడిగాడు. "లేదండీ! వీడొక్కడే మాకు లేక లేక కలిగిన సంతానం. అయితేనేం? వీడి అల్లరి యింతా అంతా కాదు. కవల పిల్లలేం లెక్క? పదిమంది పిల్లల అల్లరి వాడొక్కడే చేస్తాడు" అని యశోదమ్మ కన్నయ్య చెంపపై ఒక చిన్న దెబ్బవేసి "ఇంత అల్లరి అయితే ఎలా? ఇందాక రావద్దని చెప్పాను గదా! మళ్ళీ ఎందుకు వచ్చావు?" అని గద్దించింది. "అమ్మా! నా అంతట నేను రాలేదమ్మా! ఈయన నన్ను పేరు పెట్టి పిలిస్తేనే వచ్చాను" అని బిక్కమొహం పెట్టి కన్నయ్య అనేసరికి పండితుడు నొచ్చుకుని "పోన్లే అమ్మా! పిల్లవాణ్ణి కొట్టకండి. పాపం తెలియని తనం(ఎవరికో?)" అన్నాడు. యశోదమ్మ క్షమాపణలు చెప్పుకొని "ఈసారి వాణ్ణి గదిలో పెట్టి తాళం వేస్తాను. మీరు దయచేసి మళ్ళీ వంట చేసుకోండి. ఈసారి మీరు మీ గది తలుపులు గడియపెట్టుకొని మరీ భోజనానికి కూర్చోండి" అని అన్ని ఏర్పాట్లూ చేసింది. ఈ గడియలూ, తాళాలూ ఆయన్ను ఆపగలవా? తన పుత్రుడనే మోహభావం ఆమెకు, శూద్రబాలుడనే నీచభావం, జాత్యహంకారం ఆయనకు, ఇద్దరూ అజ్ఞానంలో ఉన్నవాళ్ళే. కన్నయ్యను గదిలో పెట్టి తాళం వేసింది యశోదమ్మ.

పండితుడు మళ్ళీ నానాయాతనా పడి మూడోసారి వంట చేసుకున్నాడు. మరి అతని మూడు గుణాలూ హరిస్తేగానీ తరించే వీలు లేదు కదా! గది తలుపులు గడియ పెట్టుకున్నాడు. వడ్డించుకున్నాడు, భక్తిగా “ఓం కేశవాయస్వాహా... అని ముమ్మారు ఆచమనం చేసేసరికి గజ్జెల చప్పుడు మళ్ళీ వినిపించింది. తల ఎత్తి చూసేసరికి కృష్ణయ్య కనిపించి, అంతలోనే ఆ స్థానంలో విశ్వరూపం మహా తేజోవంతమై పండితుడికి దర్శనమైంది. సాష్టాంగ వందనం చేసి “ప్రభూ! అజ్ఞానిని” అని స్వామి పాదాలు తాకేసరికి ఆయనలో దివ్యజ్ఞానం ఉదయించింది” సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణరూపంలో అవతరించాడని ఎందరో చెప్పగా విన్నాను. ఎన్నో అనన్య సాధ్యమైన దివ్య లీలలు చూపించావని విన్నాను. సాక్షత్తు నాయీ కళ్ళతో నిన్ను చూశాను. నేను కేశవ నారాయణ నామాలు స్మరించేసరికి నీవు దర్శనమిచ్చావు. నిన్ను పిలిస్తేనే వచ్చానన్నావు. నిజమే! అన్ని నామాలూ, అన్ని రూపాలు నీవేకదా! అయినా గ్రహించలేక, నీవు గొల్లవాడవని, నేను బ్రాహ్మణుడననే జాత్యహంకారంతో గుడ్డివాడనైన నా కళ్ళు తెరిపించటానికి, నన్ను అజ్ఞాన తిమిరం నుండి రక్షించి జ్ఞానదృష్టిని ప్రసాదించటానికి యింత శ్రమపడ్డావా ప్రభూ!” అని కన్నీళ్ళతో ప్రభువు పాదాలను అభిషేకించుకున్నాడు. చిరునవ్వులు చిందిస్తున్న కన్నయ్య బుల్లి చేతులతో ఆ పండితుని లేవదీసి అనుగ్రహించి జ్ఞానభిక్షను ప్రసాదించాడు.

భగవంతుని యందు మనసు నిలవాలన్నా, అజ్ఞానం తొలగాలన్నా, అది సామాన్య విషయం కాదు. భగవంతుని దయ ఉంటేనే అది జరుగుతుంది. కనుక అజ్ఞాన ఆవరణ తొలగి, సర్వత్ర పరమాత్మనే దర్శించి ఆనందం, పొందాలి అనుకుంటే, భగవంతుని(గురుదేవుని) ఆశ్రయించాలి. గురుదేవునికి పరమాత్మకు భేదం లేదు. ప్రత్యక్ష పరమాత్ముడే గురుదేవుడు. చూడండి. పైన చెప్పుకున్న ప్రచండ పండితుడికి అతని పాండిత్యం వల్ల జ్ఞానం వచ్చిందా? లేదు. పరమాత్మ దయ కలిగితేనే వచ్చింది.

వ్రేపల్లె వాసులందరూ తరించే మార్గం తెలుసుకుందామని తెల్లవారుఝామున శ్రీకృష్ణుని దర్శనానికై యమున ఒడ్డుకు వెళ్ళారు. యమునకు ఆయనకు ఎంతో అనుబంధం. కృష్ణయ్య యమున ఒడ్డున ఉన్న మెట్లపై కూర్చొని, పాదాలు యమున నీళ్ళలో ఆడిస్తూ మురళి వాయిస్తుంటే పశుపక్ష్యాదులు కూడా పులకించి పోయేవి. యమున ఆ పాదస్పర్శతో ఉప్పొంగిపోయేది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ఆశ్రమంలో ఇద్దరబ్బాయిలు వారి తల్లిదండ్రులని, 'ఏమిటి నాన్నగారూ! ఆనందం ఆనందం అంటారు మీరు. మేమేదీ పొందటంలేదే. అదేదోమాకు చూపించండి!' అని సవాల్ చేశారు. ఆ తల్లిదండ్రులకి జవాబు ఎలా చెప్పాలో తెలియలేదు. ఇదంతా వారి గృహంలో జరిగింది. రెండో కంటికి తెలియదు. ఒకనాడా పిల్లలిద్దరూ స్కూలికి వెళ్తూవుండగా, గురుమహరాజ్ (వాకింగ్ చేస్తూ) వారిని పిలిచి, 'ఏరా అబ్బాయిలూ, స్కూలికి వెళుతున్నారా? ఇలా రండి ఒక్కసారి' అని ఒక పిల్లవాడి మెడ ఎముక మీద గట్టిగా నొక్కి పట్టి వుంచేసరికి, ఆ పిల్లవాడు, 'అమ్మో!



నొప్పి, నొప్పి వదలండి' అని గిలగిల లాడిపోయాడు. అప్పుడు బాబూజీమహరాజ్‌వారు, 'ఏరా! నొప్పా? ఎక్కడుందిరా? నాకు కనిపించటం లేదే! ఏదీ నీ నొప్పి చూపెట్టు. నువ్వు చూపించకపోతే నాకెలా తెలుస్తుందంటావ్?' అన్నారు! ఆ కుర్రవాడికి ఏం చెప్పడానికీ అంతుబట్టలేదు. అప్పుడు గురుమహరాజ్, 'ఏరా! మీ నాన్నగారిని ఆనందం చూపించమన్నావుగా! ఇదిరా నా సమాధానం! నీ నొప్పిని నువ్వు చూపించగలిగావా? అది అనుభవైక వేద్యం!' అన్నారు. అంతకు ముందెవ్వరూ వెళ్ళి స్వామి వారికి ఈ విషయాలేవీ చెప్పలేదు. అదే సర్వవ్యాపకత్వం, సర్వజ్ఞత్వం అంటే! ఆ పిల్లలతో సంభాషణ ఎక్కడో వాళ్ళింట్లో జరిగింది - దానికి స్వామి యీ విధంగా జవాబిచ్చారు! అట్టిది గురుతత్వం. ఇంకా ఆ పిల్లలకీ విధంగా బోధ చేశారు స్వామి. 'నీ నొప్పి నువ్వెలా చూపించలేవో, ఆ ఆనందం కూడా అంతేరా. నువ్వుకూడా ఆ విధంగా సాధన చేస్తే, ఆ ఆనందం నువ్వూ పొందగలుగుతావు. నాకు విరక్తి రావాలి. అని అనుకో. మొక్కగా వున్నప్పుడు వంగుతుంది. మానైపోయాక వంగదు. కనుక ఇప్పట్నించీ నేర్చుకో అని అన్నారు. ఈ నాటికీ వారు స్వామికి శిష్యులయ్యేవున్నారు. పెళ్ళిళ్ళు కూడా చేసుకున్నారు.

అటువంటి సమర్ధవంతమైన గురుపాదాన్ని ఆశ్రయిద్దాం. ఇంకా యింకా ఆస్వాదన చేద్దాం. ఎందుకంటే అనంతాన్ని ఎవరు పట్టుకోగలరు? మనం అనంతంలోనే వున్నాం. అనంతం అయ్యేవున్నాం. మనం అనంతానికి చెందేవున్నామని మన మనస్సుకి గోచరం కావటం లేదు. అనంతమైనటువంటి ఆత్మ వస్తువు మనమే అయివున్నాం. దానిని అనుభవానికి తెచ్చుకోడానికి గురుదేవుడి నాశ్రయించాలి. వారు చెప్పింది చెప్పినట్టుగా ఆచరించాలి. అప్పుడు మనసు కూడా అక్కడికి వెళ్లి లయించిపోయి ఆనందాన్ని పొందుతుంది. కనుక అటువంటి బ్రహ్మానందానుభూతిలో ఓలలాడుదాం. అటువంటి ఆత్మానందాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించమని మహాత్ములని ప్రార్థిస్తూ.....జై గురుదేవ్!

## 8. ఆచరణ ముఖ్యం

(18.09.2003 - విజయవాడ)

శ్రీబాబూ భక్తసమాజ్ - విజయవాడ

ఎన్ని చెప్పుకున్నా ఎన్ని విన్నా 'ఆచరణ' అనేది ముఖ్యం. పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించిన విస్తరి ముందరే వున్నా, తినవలసింది మనమే. నిండు విస్తరి మన ఎదుటనే వున్నా మనం తింటేనే మన కడుపు నిండేది, మనకి బలం వచ్చేది. ఆకలిగొన్న కడుపయితే రుచులు ఎంచకుండా, చక్కగా కడుపునిండా తింటుంది. కానీ యితరత్రా తిన్నవాళ్లకి, ఇక్కడ వడ్డించినవి రుచికరించవు.

ఆధ్యాత్మిక ఆకలి బాగా వున్నవారికి పలికించేవాడు, వినేవాడు, వినిపించేవారు, వేరు అనే భావన రాదు. ఇన్నింటిలోనూ, ఇందరిలోనూ ఒకే శక్తి పనిచేస్తోందని తెలిసి ఆనందాంబుధిలో ఓలలాడుతారు. ఎంత సత్సంగానికి వచ్చి కూర్చున్నా, మన ఆలోచనలు ఎక్కడో వుంటే అది వృధా. ('తనువొక చోట - మనసొకచోట - ఉన్న మానవుని జన్మమె వృధారా' అని కీర్తన పాడారు).

ప్రపంచపు సుడిగాలులలో పడి జీవితానికి కావలసినదేదో గుర్తించకపోతే, ఈ మానవ జీవితం వచ్చినది ఎందుకు? ప్రపంచపు ప్రేమలు మనకి తాత్కాలికంగా సుఖాన్ని ఇచ్చినట్టుగా వున్నా, చివరకు మాత్రం దు:ఖాన్ని మిగులుస్తాయి. భగవంతుడిని ప్రేమిస్తే అది 'భక్తి' అవుతుంది. భగవంతుడి ప్రేమ ఒక్కటే కళంకరహితమైన ప్రేమ. మానవుల ప్రేమలెలా వుంటాయి

అంటే 'మీ ఇంటికి వస్తే ఏమిస్తావు? మా ఇంటికి వస్తే ఏం తెస్తావు?' అంటారు. పున్నమినాడు పూర్ణాలు పెట్టాను. అమావాస్యనాడు అట్లు పెట్టాను అని ఇంత ఇచ్చి అంత చెప్పుకుంటారు. అన్నీ ఇస్తున్న భగవంతుడు ఏమీ చెప్పుకోడు. అడగకుండానే ఇచ్చేవాడు భగవంతుడు. అడిగినా ఇవ్వనివాడు మానవుడు.

మానవుడు తరించడానికి భక్తి ఒక్కటి చాలు. భక్తియొక్క పరాకాష్ఠయే జ్ఞానం. జ్ఞానం యొక్క పరాకాష్ఠ మోక్షం. మోక్షద్వారానికి శమము, విచారణ, సంతోషము, సాధుసాంగత్యము అనే నలుగురు ద్వారపాలకులు వున్నారని వశిష్ఠులవారు శ్రీరామచంద్రుడికి చెప్పినట్టు 'వశిష్ఠ గీత' చెబుతున్నది.

మోక్షద్వారే ద్వారపాలాః! చత్వారః పరికీర్తితాః।
శమో విచారః సంతోషః చతుర్థః సాధుసంగమః।

ఈ నాల్గింటిని, లేక మూడింటిని, లేకపోతే కనీసం ఒక్కదానినైనా ప్రయత్న పూర్వకంగా సాధిస్తే మోక్షమనే భవనం యొక్క ద్వారం తెరవబడుతుంది అని వశిష్ఠులవారు శెలవిచ్చారు. ఒక్కటి సాధించినా మిగతా మూడు కూడ మన వశమవుతాయి.

'శమము' అంటే అంతరింద్రియ నిగ్రహము. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అనేవి అంతరింద్రియములు. మనసు సంకల్పం చేస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది. చిత్తం ఆలోచిస్తుంది, అహంకారం క్రియ చేస్తుంది. మనసుకి అసిస్టెంటు చిత్తం; బుద్ధికి అసిస్టెంటు అహంకారం. అలా బజారులో వెళుతూ ఏదో ఒక కొట్టులో ఒక వస్తువు చూస్తాం. అది కొనుక్కుంటే బాగుంటుంది కదా అని సంకల్పం చేస్తుంది మనసు. ఇక చిత్తం దాని గురించే ఆలోచనలు చేస్తుంది. మంచిబుద్ధి అయితే 'ఇప్పుడు నీకది అక్కరలేదు. నీకు అలాంటిదే ఒకటి వుంది కదా' అని నిర్ణయం చేస్తుంది. అప్పుడు అహంకారం అణిగి ఊరుకుంటుంది. అదే విషయాకారితమైన బుద్ధి అయితే 'ఫరవాలేదులే. ఒకటి వున్నా అది పాతదయిపోయింది కనుక, ఇది కొనుక్కోవచ్చు' అని నిర్ణయిస్తుంది. అప్పుడు వెంటనే అహంకారము, కొట్టుకి వెళ్లి ఆ వస్తువుని కొనేటట్టు చేస్తుంది. ఇలా ప్రతి క్షణం మనస్సు ఎన్నెన్నో సంకల్పాలు చేస్తూ వుంటుంది. అసలు 'మనస్సు' అంటేనే సంకల్ప, వికల్పాల పుట్ట. అందుకనే అన్నిటికీ మెయిన్ స్విచ్ మనస్సు అని చెప్పేవారు గురుమహరాజ్.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

శ్రీబాబు మాట్లాడుతూ మీరు పండితులు. భారత మూల గ్రంథం చదవండి. మీ సందేహ నివృత్తి అవుతుంది. శ్రీకృష్ణ పరమాత్ముడు కురుక్షేత్ర సంగ్రామంలో ఆయుధాలు ధరించాడా? సాక్షాత్తు పరమాత్ముడు, భక్త రక్షకుడు కాబట్టి రథుకుడిగా ఉండటానికి ఒప్పుకున్నాడు.పరమాత్ముడు సాకారంగా, నిరాకారంగా రెంటికీ అతీతమైన పరబ్రహ్మగా ప్రకాశిస్తాడు. కాని భీష్ముడు శ్రీకృష్ణ పరమాత్ముని నారాయణమూర్తిగా శంఖచక్రాలతో దర్శింపగోరాడు కాబట్టి ఆ విధంగా దర్శనం ఇచ్చాడు. అంతేకాని భీష్ముణ్ణి సంహరించడానికి కాదు అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ భగవానుని నిర్గుణ తత్త్వం అంటే ఏమిటి? సర్వ వ్యాపకుడు అంటే ఏమిటి? చీమలోనూ, ఈగలోనూ, దోమలోనూ, మానవునిలోనూ, చెట్టులోనూ అంతటా ఉన్నది ఒక్కటే వస్తువు అనేది భావంలో కాక, క్రియలోను, ఆచరణలోను ఉండాలి. అలా తెలుసుకున్నవాడికి శత్రువులు ఎవరు? అప్పుడు ఈర్ష్య అసూయ ద్వేషాలు ఎవరి మీద కలుగుతాయి? కామ క్రోధాది గుణాలు ఎక్కడ ఉంటాయి? అంత ఎందుకు నేను ఎక్కడ ఎలా ఉన్నా మీరు చేసే పనులన్నీ నేను చూస్తూనే ఉంటాను కదా! ఆ విషయాన్ని తెలుసుకున్న వారైతే మంచి సాధన చేయాలి గాని మిగిలిన వాటికి టైమ్ ఎందుకు ఇవ్వాలి? ఆలోచించండి అన్నారు శ్రీబాబు.

**28-3-1985**

ఈ రోజు సౌత్ సెంట్రల్ రైల్వే జి.యమ్. మల్లిక్ గారు విజయవాడ డి.ఆర్.ఎమ్. వారి కుటుంబ సభ్యులతో శ్రీబాబూజీ దర్శనార్థం వచ్చారు. వారంతా సాయంత్రం అన్ని ఆలయాలను దర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఇంతలో శ్రీబాబూజీ వారిని రమ్మనమని కబురుచేశారు. నారాయణ రావుగారు, మూర్తీజీ కూడా వారి వెంట వెళ్ళారు. శ్రీబాబు వారికి ఉద్బోధ చేస్తుండగా చాలమంది భక్తులు ప్రార్థన జరుగుతుండగా ఉపన్యాసము వినడానికి వెళ్ళారు.

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ క్రింద ప్రార్థన జరుగుతుంటే అలక్ష్యం చేసి ఇక్కడికి దేనికోసం వచ్చారు. మీరంతా ముందు వెళ్ళి ఆ ప్రార్థనలో పాల్గొనండి. ప్రార్థన అయిన తరువాత ఈ సమావేశంలో పాల్గొనవచ్చు అన్నారు. భక్తులంతా వెళ్ళిపోయారు. -సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**సెప్టెంబరు 2010**

**1 -3 బుధవారము నుండి శుక్రవారము వరకు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు**

| | | |
|---|---|---|
| 1 | బుధ | ఉదయం కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ అర్చన, సత్సంగం, భక్త సమారాధన, సాయంత్రం శ్రీ సద్గురు పాదపూజ |
| 2 | గురు | ఉదయం 05గం. 30ని.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, ఉదయం10 గం.లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన. |
| 3 | శుక్ర | శ్రీ గురుదశమి, ఉదయం 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గం.లకు ఉట్టి కొట్టుట |
| 5 | ఆది | టీచర్స్ డే, ఉదయం 10 గం.లకు ఆచార్య దినోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ |
| 7 | మంగ | మాసశివరాత్రి. |
| 11 | శని | శ్రీవినాయక చవితి, ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురు పాదపూజ. ఉదయం11 గం.లకుశ్రీవిఘ్నేశ్వర సామూహిక పూజలు. భక్త సమారాధన. |
| 23 | గురు | భాద్రపద పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ. |

**అక్టోబరు 2010**

| | | |
|---|---|---|
| 3 | ఆది | శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 6 | బుధ | మాస శివరాత్రి |

**8 శుక్రవారము నుండి, 19 మంగళవారం వరకు శ్రీదేవీనవరాత్రోత్సవములు.**

ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్, మరియు శ్రీవెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీదేవీ భాగవత ప్రవచనము. మధ్యాహ్నము జగన్మాత కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన సాయంకాలము -6 గం.లకు ప్రార్థన, 7 గం.లకు

జగన్మాత సాయంకాలపూజ, తీర్థ ప్రసాదములు. 9 శనివారము నుండి 18 సోమవారము వరకు వరకు ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారి అనుగ్రహభాషణము, మరియు ఆశ్రమ భక్తుల ఆధ్యాత్మిక ప్రసంగములు, శ్రీ గురుదేవుల దివ్యదర్శనము,బోధ (వీడియో), శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువులమ్యూజియమ్ ప్రదర్శన (అర్థగంట)

| | | |
|---|---|---|
| 8 | శుక్ర | ఉదయం గం.6.35నిలకు శ్రీమాతాజీవారి శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా దీక్షా స్వీకారము |
| 13 | బుధ | శ్రీ సరస్వతీపూజ, మూలా నక్షత్రం. |
| 15 | శుక్ర | దుర్గాష్టమి. ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు, |
| 16 | శని | మహర్ణవమి. |
| 17 | ఆది | విజయదశమి, ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు, నామకరణములు, అన్నప్రాశనలు,అక్షరాభ్యాసములు రామాలయంలో జరుగుతాయి. |
| 18 | సోమ | ఏకాదశి, ఏకాహం,దీక్షావిరమణ, పూజాక్షతలు శ్రీమాతాజీ భక్తులపైన చల్లుతారు,రాత్రి 7 గం.లకు జగన్మాత దర్శనోత్సవము (ఊరేగింపు.) |
| 19 | మంగ | రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ. |
| 22 | శుక్ర | పూర్ణిమ, శ్రీమాతాజీవారి 56వ జన్మదినోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ,సత్సంగం, భక్త సమారాధన. |

## టీ.వీలో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

**శ్రీ మాతాజీవారి కార్యక్రమములు ప్రతిరోజు భక్తి ఛానెల్‌లో ఉదయం 5 గం॥ నుండి మరియు టి.వీ -(1) ఛానెల్‌లో 5గం॥30ని॥ నుండిమరియు భక్తి ఛానెల్‌లో అదనంగా ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 5 గం॥నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.**

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

అందువలన ధ్యానం అనేది మానవజీవితానికి ముఖ్యం. ధ్యానం చేయకుండా ఎవరూ ఉండటంలేదు. ప్రతివారికీ ధ్యానం ఉండనే ఉంటుంది. విషయాలమీద ధ్యానం లేనివాడు ఎవడున్నాడు? గురువులు చాలా సులభమైనది చెపుతున్నారు. విషయాలను ధ్యానంచేస్తున్న నీ మనస్సును అటువైపునుండి మరల్చు అన్నారు. ధ్యానం అంటే ఏమిటి? అటువైపుకు తిరగి ఉన్న అద్దాన్ని ఇటువైపుకు తిప్పు అంతే! ధ్యానం అంటే ఎంత సులభం? అద్దం నీ చేతిలో ఉన్నది. దాన్ని ఇటువైపుకు తిప్పు అంతే! గురువులు చెప్పారు. నీ మనస్సనే అద్దం ప్రపంచంవైపు తిరిగిఉన్నది. సంసారంవైపు తిరిగి ఉన్నది. దాన్నేంచెయ్యాలి? అద్దాన్ని తిప్పినట్లే నీ మనస్సును అంతర్ముఖం చేసుకోవాలు. నీ మనస్సును అంతర్ముఖం చేసుకుంటే అయిపోయినట్లే. ఎంత సులభం ఇది? ఎంతో కష్టం అనుకుంటున్నారు. కాని ఇందులో కష్టమేమున్నది? ఇది ఎంతో సులభం. మీ చెయ్యి అటువైపు తిరిగిఉన్నది. దాన్ని ఇటువైపు తిప్పటం కష్టమా చెప్పండి? మీ మనస్సు కూడ అంతే. ప్రపంచ విషయాకారమైన మనస్సు పరమాత్మవైపు తిరిగి ఆత్మాకారకారితవృత్తిగా కావాలి అంతే. మీరు రోజూ అప్రయత్నంగా మనస్సును తిప్పుతూనే ఉన్నారు. కడుపునిండా తింటే కమ్మగా నిద్ర వస్తుంది. ఆ నిద్రలో ఏం చేశారు మనస్సును? అంతర్ముఖమైపోయింది. అది స్తబ్దత కాదు. పరమాత్మ సన్నిధికి వెళ్ళిపోయింది. నిద్రలో నీ మనస్సు ఏమైంది? నిద్రలో ఉండే మనస్సులో విషయాలు తొలగలేదు. మఱి విషయాలు తొలగకపోయినా శాంతి ఎలా వచ్చింది? అది ఆత్మాకారా కారితవృత్తి ధరించింది. వృత్తి ప్రభాకరము, వృత్తిరత్నావళి గ్రంధాలు చూస్తే ఇంకా బాగాతెలుస్తుంది. మీ మనస్సులో విషయాలు తొలగినంతమాత్రాననే శాంతి కలగదు. ఆ విషయాలతోకూడిన మనస్సు ఆత్మాకారాకారిత వృత్తి ధరిస్తే అప్పుడు కలుగుతుంది శాంతి.

మనస్సు విషయాలు లేకపోతే స్తబ్దం అయిపోతుంది. మనస్సులో

విషయాలు లేవు. ఏముంది అక్కడ నిద్రలో? సమాధిలో? మీరు ధ్యానం చేస్తారు. కాని ధ్యానం చేసేవారందరు ఒక్క క్షణమైనా ఆ శాంతిని అనుభవిస్తారు. ఒక్క క్షణమైనా! ఆహా! ఎంత ఆనందంగా ఉన్నది అనుకోమా? అక్కడ ఏమైంది? మనస్సు బ్రహ్మాకారితమైపోతుంది. కొంతమంది మనస్సు లేకుండా పోయింది అంటారు. మనస్సు లేకుండా పోతే అది నిద్ర అవుతుంది. మనస్సు ఉండాల్సిందే. మనస్సు బ్రహ్మాకారం కావాలి. వృత్తి నివృత్తి అయిపోవాలి. చిత్తం చిత్తై పోవాలి. చిత్తం లేకుండా పోవటం కాదు అది చిత్తైపోవాలి. చిత్తంలో ఉండే దోషాలు పోతే నీ చిత్తం చిత్తైపోతుంది. చిత్తం చిత్తైయ్యేదానికే మనం ధ్యానం చేసేది. చిత్తంటే ఏమిటి? ఆత్మ స్వరూపం. దాన్ని చింతించటమే ధ్యానం. ధ్యేయమైన పరమాత్మ వస్తువును నీ చిత్తం చింతిస్తూఉంటే, ఆ చిత్తంలో ఉన్న మాలిన్యం తొలిగిపోయి,నీ చిత్తం చిత్తైపోతుంది.

నీ చిత్తం దేనిని ధ్యానం చేయాలి? తచ్చింతనం, తత్కథనం, అన్యోన్యం తత్ప్రబోధం. తత్ + చింతనం = తచ్చింతనమ్. తత్ - అంటే అది. అది అంటే పరబ్రహ్మ స్వరూపం. పరబ్రహ్మ స్వరూపం అంటే ఏమిటి? నీవే! దానిని చింతన చెయ్యి. తత్ప్రబోధం అంటే దానిని గురించే విను. అన్యోన్యత అంటే దానిని గురించే మాట్లాడుకోండి. దానిని గురించి తప్ప ఇక మరి దానిని గురించి మాట్లాడుకోకండి. అప్పుడేమౌతావు? దానిని చింతన చేస్తే, దానిని భావన చేస్తే, దానిని గురించి మాట్లాడుకుంటూ ఉంటే, అదే అయిపోతావు. అదే భ్రమర కీటక న్యాయం ప్రపంచ విషయాలు మాట్లాడుతుంటే నువ్వు ప్రపంచంవాడివైపోతావు. సంసార విషయాలు మాట్లాడుతుంటే పక్కా సంసారివి అవుతావు. టి.వి విషయాలు మాట్లాడుతుంటే నీవు టీ.వీ వాడివైపోతావు. వేరే విషయాలు మాట్లాడుతుంటే వేరేవాడివైపోతావు. పత్రిక విషయాలు మాట్లాడుతుంటే నీవు పత్రికవాడివైపోతావు. అందుకే తత్ అంటే పరమాత్మ స్వరూపాన్ని గురించే మాట్లాడుకోవాలి. ఎక్కడకూర్చున్నా సరే దానిని గూర్చి చింతన చేయండి. అందువలన,

**ధ్యేయాయాః చింతనం ధ్యానం.**

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

వాటి అన్నిటి మధ్యనుండి మేఘ గంభీర స్వరంతో పాండురంగడి మాటలు వినిపించాయి "నామా! కలియుగపు బెదరింపులకు హతాశుడవు, నిర్వీర్యుడవు కావద్దు. నీవు సనాతనుడివి. నీవు అఖండమైన సద్భావానివి. మూర్తీభవించిన కరుణవు. చైతన్యానికి ప్రేరణవు. పూర్ణ జ్ఞానానికి జ్యోతివి. నీవే సద్భక్తుడవు. నీవే పరమేశ్వరుడవు. అంతా నీవే అయి అంతా నిండి పొంగిపొరలుతున్నావు. కలికాలం అంటే భయం లేదని అభంగాలలో చాలా సార్లు పాడావు. అది మరచి పోయావా? ధర్మగ్లానిని, హానిని నీవే పారద్రోలాలి. భాగవత ధర్మాన్ని దేశం అంతటా ప్రచారం చేయాలి. ఏ భాషలేమితనము నీకు అడ్డుకాకూడదు. దేశంలోని అన్ని భాషలు నీవే. అందరినీ వారి వారి భాషలలో పలకరించు. వారికి జ్ఞానభక్తిని అద్వైతాన్ని బోధించు. ఈ నీ చివరి తీర్థ యాత్ర విజయవంతంగా ముగించి తండ్రి ఆజ్ఞను సక్రమంగా, సంపూర్ణంగా నిర్వర్తించిన తనయుడిగా, గర్వంగా తలయెత్తుకుని తిరిగిరా. అప్పుడు మన మనస్సులలోని మాటలు పరస్పరం చెప్పుకుందాము." శంఖారావాలు, ఘంటానాదాలు, వినబడటం ఆగిపోయింది. నామదేవుడు నిమీలిత నేత్రాలను తెరచి చూసే సరికి పాండురంగడు ఎప్పటి వలె ఇటుకపై చిరునవ్వులు చిందిస్తూ దర్శనం ఇచ్చాడు. నామదేవుడికి తన కర్తవ్యం బోధ పడింది.

నామదేవుడు భక్తి, ప్రేమ అనే కడవలను తగిలించిన నామ సంకీర్తన, భజన అనే కావడిని భుజం మీద పెట్టుకుని పంఢరి నుండి బయలుదేరాడు. జనికి కన్నీళ్ళు ఆగటం లేదు. చూస్తూ చూస్తూ తట్టుకోలేక కుప్పకూలిపోతానేమో అని గిరుక్కున వెనక్కు తిరిగింది తన కన్నీళ్ళను చూస్తే నామదేవుడు భరించలేడేమో అని. జనిని సమాధాన పరిచి నామదేవుడు పాండురంగనితో ప్రభూ నా హృదయంలో నిరంతరం నీ చరణారవిందాలే నిలచిపోవుగాక. నా కళ్ళలో ఎప్పుడూ నీ భువన మోహన రూపమే దర్శనం ఇచ్చుగాక" అని హృదయపూర్వకంగా ప్రార్థించి మనస్సును దృఢం చేసుకుని ఉత్తర దిశగా బయలుదేరాడు. అళందిలో జ్ఞానదేవుల ఆశీస్సులను పొంది త్ర్యంబకేశ్వరం పుష్కరిణి చేరాడు. నివృత్తి నాథ్ ల ఆశీర్వచనం కూడా పొంది గుజరాత్ లో ప్రవేశించాడు. దారిలో అంతా ప్రేమ సందేశాన్ని పంచుతూ ద్వారక చేరాడు.

అక్కడ నుండి జునాగఢ్ చేరి నర్సీమెహతాతో బిలఖా క్షేత్రంలో మూడు రాత్రులు అధ్యాత్మ చర్చలతో గడిపాడు. సౌరాష్ట్రలో భక్తి ప్రచారం చేయవలసిందిగా నర్సీమెహతాకు బాధ్యతలు అప్పచెప్పి, మార్వాడ్ చేరాడు. అక్కడ అంతా ఎడారి. ఇసుక తప్ప ఏమీ లేదు. ఒంటెల మీద సవారి. ఎండ చాల ఎక్కువగా ఉన్నది. నామదేవులకు బాగ దాహం వేస్తున్నది. అక్కడ ప్రక్కనే ఒక బావి కనిపించింది. అందరూ ముందు ప్రయాణంలో అవసరం వస్తాయని బిందెలతో, కుండలతో, తోలుతిత్తులలో నీళ్ళు నింపుకుంటున్నారు. నామదేవుడు ఏం చేయాలో తోచక చూస్తూ నిలుచున్నాడు. ఒక తరుణి నీళ్ళ బిందె చంకన పెట్టుకుని నామదేవుడిని సమీపించి "మహరాజ్! దాహంగా ఉందా? బాగా ఎండలో నడచి వచ్చి అలసిపోయినట్లున్నారు" అని అడిగింది. నామదేవుడు అవును అన్నట్లు దోసిలి పట్టాడు. ఆమె దోసిలిలో నీరు పోస్తూ, "బాబా! ఈ బావి మాత్రం ఎప్పుడూ ఎండిపోదు. ఈ మార్వ్యాడ్ అంతటిలో ఈ బావి నీళ్ళు అత్యంత మధురంగా ఉంటాయి. ఈ బావి పేరేమిటో తెలుసా? ఇది నామదేవుడిగారి బావి" అని చెప్పింది. ఆమె స్వరంలో నామదేవుని పట్ల కృతజ్ఞత, భక్తిభావం ధ్వనిస్తున్నాయి. కాని చిత్రం ఆమె ఎవరి దోసిట్లో త్రాగటానికి నీరు పోస్తున్నదో ఆ వ్యక్తి  నామదేవుడి బావి అనే పేరులోని నామదేవుడే అని ఆమెకు తెలియదు. నామదేవుడికి గుర్తు వచ్చింది, ఆనాడు జ్ఞానదేవుడు ఈ బావిని సృష్టించి దానిని మధుర జలాలతో నింపి దానికి తన పేరు పెట్టటం, వారి అమోఘమైన ఆశీర్వచనం. నామదేవుడు కృతజ్ఞతతో జ్ఞానదేవుణ్ణి తలచుకున్నాడు. ఆయన జన ప్రవాహంలో కలసి మజిలీలు చేస్తు అమృతసర్ వచ్చారు. అక్కడి పంజాబీలు సైతం భేదభావం మరచి నామదేవుడితో కలసి హరినామం చేస్తున్నారు. అమృతసర్ పరిసరాలలో నామదేవ బాబా పేరుతో ఒక మఠం కట్టించారు. మఠంలో అందరికీ ఒకే రకమైన వర్తన, అందరిలో మంచిని చూడు అని. అందరికీ ఒకే బోధ, నరజన్మ దుర్లభం మళ్ళీ మళ్ళీ లభించదు ఇది ఉండగానే మీ హృదయంలో ఉన్న ఈశ్వరుణ్ణి గుర్తించండి అని.

ఉత్తరాన ఒక చిన్న పంఢరిపురం వెలసింది. ఎక్కడ చూచినా అందరూ నామదేవుడి అభంగాలను పాడుతున్నారు. ఈ నామ ప్రచారం, జనాకర్షణ చూసిన సుల్తాను గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. సుల్తాన్ మహమ్మద్ తుఘ్లక్ వీటికి మూలం నామదేవుడు అని తెలుసుకుని నామదేవుణ్ణి బందీగా పట్టుకుని

రావలసిందిగా సైన్యాధిపతిని ఆజ్ఞాపించాడు. సైనికులు నామా కోసం అంతా గాలించి చివరకు అమృతసర్‌లో అతన్ని పట్టుకున్నారు. సైనికులు నామదేవుడి చేతులకు, కాళ్ళకు బేడీలు వేసి నడిపిస్తున్నారు. నోటి వెంట విఠలా విఠలా అన్న నామం తప్ప నామదేవుడు వాళ్ళను ఎందుకు? ఎక్కడికి? అని అయినా అడగలేదు. సైన్యాధిపతి కులీద్‌ఖాన్‌తో పాటు నామదేవుడు కూడా ఒక ముసాఫిర్‌ఖానాలో బస చేశాడు. నామదేవుణ్ణి రహస్యంగా ఒక చీకటి గుహలో బంధించి చిత్రహింసలు పెడుతున్నాడు. అది తెలిసి అక్కడి ప్రజలు ప్రతిఘటించటానికి సిద్ధం అయినారు. కులీద్‌ఖాన్ ఈ వార్త సుల్తానుకు చేరవేశాడు. సుల్తాన్ తన మంత్రులతో సంప్రదించి ఇది పెద్ద ఘర్షణకు దారి తీయవచ్చు అని ఒక చీకటి రాత్రి రహస్యంగా నామదేవుణ్ణి ఆ చీకటి గుహలోనుంచి ఒక శిధిల మందిరానికి తరలించారు. అయినా ఈ వార్త బయటికి పొక్కింది. నామాను చీకటి కొట్లో నుండి ఎక్కడికో రహస్యంగా తరలించారు అన్న వార్త తెలియగానే జనం ఎవరికి దొరికిన ఆయుధం వారు పట్టుకుని ఢిల్లీ వెళ్ళి సిపాయిలను చుట్టుముట్టారు. ఉప్పెనలా పొంగివస్తున్న జన ప్రవాహాన్ని చూసి సిపాయిలు భయపడి నామదేవుణ్ణి శరణుజొచ్చి, వారు కూడ విఠల నామం చేయటం మొదలు పెట్టారు. జనం రాజభవనపు రాళ్ళ గోడలను బ్రద్దలు కొట్టారు. రాజభవనం విఠల నామంతో మారుమ్రోగుతున్నది.

ఇది విని సుల్తాన్ మగువ కౌగిలిని విడిపించుకుని అంగరకా తగిలించుకుని ఆదరా బాదరా అంతఃపురం నుండి బయటకు వచ్చాడు. ఆయన వెనకనే అంగరక్షకులు బయలుదేరారు. విఠల గర్జన సుల్తానుకు కర్ణకఠోరంగా ఉన్నది. చెవులు మూసుకుని 'ఖామోష్' అని అరిచాడు. కాని ఎవ్వరూ దానిని లెక్క చేయలేదు. నామం జరుగుతూనే ఉన్నది. అతడు మళ్ళీ అరిచాడు 'బంద్ కరో బక్వాస్'. నామగర్జన ఇంకా ఆగలేదు. సుల్తాన్ మళ్ళీ పెద్దగా కేకలు వేశాడు 'ఆపండి గోల, ఏమిటీ ఈ అరుపులు?' అని.

**నామ -** ఇవి అరుపులు కాదు ఇదే నిత్య సత్యం.

**సుల్తాన్ -** ఇవన్నీ ఝూటా. సత్యం ఒక్కటే.

**నామ -** మేము చెప్పేది అదే కదా. అల్లా తాలా గొప్పవాడనేగా.

**సుల్తాన్ -** అయితే మధ్యలో ఈ విఠలుడు ఎవరు?

**నామ -** మీ అల్లా తాలాను మేము విఠలా అని పిలుస్తాము. -సశేషం

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

- సుషుమ్న ప్రసాద

(గతసంచిక తరువాయి)

వెంటనే ప్రవీరుడు ప్రత్యుత్తరము పంపాడు "ఓ మహావీరా! పిరికి తనాన్ని సూచించే మాటలు మీకు తగవు. మీకు నాతో యుద్ధం చేయటం ఇష్టం లేకపోతే, ఇంద్రప్రస్థమునకు తిరిగి వెళ్ళండి. ఇష్ట పూర్వకంగా అశ్వమును వదిలే ప్రసక్తే లేదు."

ఇక చర్చలతో ప్రయోజనము లేదు కనుక ప్రవీరుని పట్టుదల చూచి, మరునాడు సూర్యోదయము కాగానే, వారిద్దరి మధ్య భీకర పోరాటము ప్రారంభమయింది. మహా భక్తుడు ప్రవీరుడు సంధించిన శరపరంపరకు పార్థుడు అప్రతిభుడయ్యాడు. అర్జునుడు ప్రద్యుమ్నుని ఉద్దేశించి, "ప్రవీరుడు చిన్నవాడు, నవయువకుడనే భావమును ప్రక్కన పెట్టి, శక్తి వంతమైన శరపరంపరతో అతనిపై విజృంభిపుము" అని చెప్పాడు. కాని ప్రద్యుమ్నుడు వెంటనే సమాధానము చెప్పాడు "నీ వలెనే ప్రవీరుడు కూడ నా పితృదేవునకు మహా భక్తుడు. ఆ భావము రాగానే నా చేతులు శక్తిహీనమై, యుద్ధములో నా శక్తిని ప్రదర్శింపలేక పోతున్నాను." వెంటనే భీమసేనుడు ఆ సమరములో ప్రథమ శ్రేణి వీరుల మధ్య నిలిచి, భీకర పోరాటం ప్రారంభించాడు. కాని ప్రవీరుని శరపరంపర ధాటికి నిర్విణ్ణుడైనాడు. ఎందుచేతనంటే ప్రవీరుడు త్రికరణశుద్ధిగా, తన తను, మన,ధనములను కృష్ణ పరమాత్మకు సమర్పించి, ఆత్మార్పణ మొనర్చుకొన్న అమోఘ భక్తి సంపన్నుడు. ప్రవీరుని శక్తి అంతా ఆయన భక్తిలోనే ఇమిడి ఉన్నది. ఇక అర్జునుడు కోపోద్రిక్తుడై, విజృంభించి, ఆగ్నేయాస్త్రమును సంధించాడు. దానికి దీటుగా ప్రవీరుడు ప్రయోగించిన వరుణాస్త్రమునకు, అగ్ని జ్వాలలణగారిపోయినవి. తరువాత అర్జునుడు ప్రవీరుని శిరస్సు ఖండించటానికి తన వద్దనున్న మారణాస్త్రములన్నింటినీ ప్రయోగించాడు. కాని విచిత్రమేమిటంటే మారణాస్త్రములన్నీ నిర్వీర్యమై రాకుమారుడు ప్రవీరుని ప్రతిభకు దాసోహమన్నాయి. పాండవ సైన్యము మహావీరుడైన అర్జునునితో సహా ఆనాటి యుద్ధంలో అపజయాన్ని చవి చూచింది.

ధీరత్వముతో విరాజిల్లే అర్జునుని వదనారవిందము నిరాశ, విచారమనే కారు మేఘములతో కాంతి హీనమైనది. ఆ తృటిలో ప్రవీరుడు ముందుకు

వచ్చి "అర్జునా ఈ శక్తిని నమ్ముకొనేనా యజ్ఞాశ్వమును వదిలినది? దయచేసి నా హెచ్చరికను గ్రహించి, నీకు ప్రాణం మీద మమత లేకపోతే, రేపు ఉదయం నాతో మరల యుద్ధానికి ఉపక్రమించు. లేకుంటే మీరు యుద్ధ ప్రయత్నమును విరమించుకొని నేను ఆహ్వానము పంపగనే, ఈ అశ్వముతో నేను చేయు అశ్వమేధ యాగమునకు కానుకలతో తరలిరండి. శ్రీకృష్ణ భగవానుని అండ దండలు లేకుండ, మీరు నన్ను జయించటమనేది అసాధ్యము. నన్ను జయించ దలుచుకుంటే, కృష్ణ పరమాత్మను మీకు సహాయము రమ్మని ప్రార్థించి, స్వామి దర్శన భాగ్యమునకు తపించే, నా చిరకాల వాంఛను నెరవేర్చండి." ఆ మాటలు మాట్లాడుతుండగానే ప్రవీరుని మనసు కృష్ణ ధ్యానములో నిలిచి పోయింది.

ప్రవీరుని మాటలు శూలాలలాగ అర్జునుని హృదయానికి తూట్లు పొడిచాయి. వెంటనే అర్జునుడు స్వామి ముందు తాను పలికిన ప్రగల్భములను గుర్తుకు తెచ్చుకొని, పరితప్త హృదయుడై కృష్ణ ప్రభువును ఆర్తితో ప్రార్థించాడు. "ఓ హరీ! ఓ ప్రభూ! ఓ గోవిందా! ఓ వాసుదేవా! నారాయణా! గర్వాంధుడనై,నేను పలికిన ప్రగల్భములకు నన్ను క్షమించి, మన్నించు ప్రభూ. నీవు సర్వజ్ఞుడవు, సర్వ సమర్థుడవు, దేవాదిదేవుడవు. వెంటనే ప్రత్యక్షమయి, నాకు రక్షణ ప్రసాదించు." అర్జునుని ఆక్రందన వినబడిన తక్షణమే, తన భక్తుని రక్షించటానికక్కడ కృష్ణ భగవానుడు ప్రత్యక్షమైనాడు. ఆ ప్రాంతములోనే పొంచి ఉన్నట్లు, వెంటనే దర్శన భాగ్యమును ప్రసాదించాడు.

కృష్ణ భగవానుడు ప్రత్యక్షం కాగానే అర్జునుడు సాష్టాంగ నమస్కారం చేశాడు. అప్పుడు కృష్ణపరమాత్మ శత్రుసైన్యము వంక తలెత్తి చూడగానే ప్రవీరుడు ఆనందాతిశయముతో మోకరిల్లి, వినమ్రతను వ్యక్త పరిచాడు. స్వామి దర్శన భాగ్యము లభించగనే ప్రవీరుని ఆనందమున కవధులు లేవు. ఆ ఆనందాతిశయముతో "ఓ ప్రభూ మీ దర్శన భాగ్యముతో నేను తరించాను" అని కీర్తించాడు. తరువాత అర్జునుని వైపు తిరిగి "హే పార్థా! ముల్లోకములకు పవిత్రతను సంతరించే కృష్ణ భగవానుని మధుర దరహాస వదనారవింద దర్శనమును ప్రసాదించినందుకు మీకెంతో ఋణపడి ఉన్నాను. నేను నా శిబిరమునకు తిరిగి వెళ్తున్నాను. రేపు మనిద్దరమూ స్వామి సమక్షములో, కదనరంగమున కలుసుకొందాము" అని తన శిబిరానికి వెళ్ళిపోయాడు. అలా ఇరువురు మహావీరులు వారి వారి శిబిరములకు తరలిపోయారు.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

**13. శ్లో॥ ప్రణయ పరిణతాభ్యాం ప్రాభవాలమ్బనాభ్యాం
ప్రతిపద లలితాభ్యాం ప్రత్యహం నూతనాభ్యామ్,
ప్రతిముహురధికాభ్యాం ప్రస్నువలోచనాభ్యాం
ప్రభవతు హృదయే నః ప్రాణనాథః కిశోరః ॥**

క్షీరసాగరంలో పుట్టింది.కుబేరుని సంపదలో చేరి అమూల్యమైన రత్నాలలో అగ్రస్థానం అలంకరించింది. శ్రేష్ఠమైన ఆ నీలమణిని విశ్వకర్మ తీసుకెళ్ళి వైకుంఠంలో శ్రీమహావిష్ణుని పాదపీఠంలో అమర్చాడు. శ్రీహరి సన్నిధిలో అణువణువు చైతన్యవంతంకాగా, స్వామి పావన పదకమల స్పర్శతో పునీతమైన నీలమణిలో చైతన్యం కలిగింది. వినీలకాంతులు వెదజల్లే దివ్యమంగళ విగ్రహుని దర్శించి పరమానంద భరితమైంది నీలమణి. తన తనూఛాయ ప్రభువును పోలినందున పొంగిపోయింది.

ఆపైన చుట్టూ కలయచూసింది. అర్ధనిమీలిత నేత్రులై ధ్యానముద్రలో ఉన్న మహర్షి పుంగవులు కనిపించారు. దేవదేవుని సమీపంలోనే ఉన్న చతుర్ముఖుడు ఉదాత్తానుదాత్తాలతో పలికే వేదవాక్కులను వింటూ మైమరచింది. అచ్చరల నాట్యాలు గంధర్వగానాలు దేవగణాల స్తోత్రపాఠాలు కనులకింపుగా వర్ణపేయంగా కనుగొంటూ వింటూ మురిసిపోయింది. ఇంతటి మహద్భాగ్యాన్ని పెట్టి పుట్టిన తన జన్మ ధన్యమైందనుకుంది. అలాగలాగ తలచే ఆ క్షణాలలో దాని మనస్సులో ఒక విచిత్రమైన కోర్కె తటిల్లతలా మెరిసింది. విరించి చేసే వేదగానం తానూ తన స్వరంలో పలకగలిగితే!! ఆశగా అఖిల బ్రహ్మాండ నాయకుడైన నారాయణుని వంక చూసింది. భక్త చింతామణి సర్వాంతర్యామి అయిన ఏలిక, నీలమణి వంక చూసి చిరునవ్వు నవ్వాడు. వరదాత అయిన కరుణామయుని మధురహాసం విలువ వేలవేల వరాలు. "వేచి ఉండు మరి. సమయం వస్తుంది" అన్నాడు. బ్రహ్మానందంలో మునిగిపోయింది నీలమణి.

యమునా తీరాన ఒక తియ్య మామిడిచెట్టుంది. దాని మీద ఒక కాకమ్మ గూడు కట్టుకొంది. ఈ మధ్య అది పొదిగిన గ్రుడ్లు పిల్లలై ఎదిగి వస్తుంటే చూసి సంతోషించేందుకు లేకుండా ఒక పిల్ల కదలలేదు కళ్ళు

తెరవలేదు. ఇరుగు పొరుగు అమ్మలక్క కాకమ్మలన్నీ దాన్ని ఓదారుస్తూ 'నీ గ్రుడ్లన్నిటిలో అది చిన్నదిగా ఉందన్నావుగద! అందుకే బలహీనంగా ఉంది కాబోలు అంటుండగానే అది చప్పున కళ్ళు తెరిచింది. అది చూసి ఆనందంగా కాకికులమంతా కావుకావుమంటూ గావుకేకలు పెట్టాయి. కాకమ్మ పొంగిపోతూ చెట్టు మీదున్న ఒక తియ్యని మామిడిపండును ముక్కుతో పొడిచి నాలుగు చుక్కలను తెచ్చి పిల్లనోట్లో పోసింది. మెల్లిగా చప్పరిస్తున్న పిల్లని చూసి 'నా చిట్టి తల్లే' అని మురిసిపోయింది. కాకిపిల్ల కాకికి ముద్దు గదా!

రోజులు గడుస్తుంటే మెల్లిమెల్లిగా కదులుతూ చుట్టు ప్రక్కలన్నిటినీ కలయచూస్తూ చిట్టితల్లి యీ ప్రపంచంలోకి వచ్చింది. కానైతే తక్కిన పిల్లలన్నీ అమ్మ తెచ్చిన ఆహారం ఆవురావురుమంటూ ఆరగిస్తుంటే అది ముందుకి రాదు. వచ్చినా నోరు తెరవదు. బలవంతాన నోట్లో పెడితే ఉమ్మేస్తుంది. ఇదేం చిత్రం అనుకుంది కాకమ్మ. ఎగరటం నేర్చుకుంటున్న పిల్లలన్నీ తల్లితో వెళ్ళి వాటి తిండి అవి సంపాదించుకుంటున్నాయి. చిట్టి తల్లి అదంతా చూస్తూ కూర్చుంటుంది కాని కనీసం పక్క కొమ్మమీదకైనా ఎగరదు. ఎవరో మునీశ్వరుడు తపస్సు చేసుకుంటున్న తీరుగా ఉన్న చోటే కళ్ళు మూసుకుని కూర్చుంటుంది. అలాగ మూసిన కళ్ళ వెనక రంగురంగుల కాంతులను ఆపైన తెల్లని వెలుగును చూస్తోంది.

ఆనాడేమైందంటే..... కళ్ళు తెరిచి చెట్టుకిందంతా చూస్తూ కూర్చున్న చిట్టితల్లికి అతి మనోహరమైన దృశ్యం కనిపించింది. ఆ సమయాన కనిపించినవన్నీ బోధ పడే విధంగా మనస్సు ఎగిరి పోయింది.

ఎవరో పిల్లలంతా చెట్లకింద ఆడుతున్నారు, ఎగురుతున్నారు, నవ్వులతో కేరింతలు కొడుతున్నారు. మధ్యలో నీలివర్ణంతో మెరిసే మేనితో, వెడల్పాటి కళ్ళతో, చూసినవారి చూపుల్ని కట్టేసేంత అందంగా ఉన్న ఒక చిన్నారి ముద్దుల బాలుడు కనిపించాడు. అందరూ వానిని కన్నయ్యా, గోపాలా అని పిలుస్తున్నారు. వాని చూస్తూ చిట్టితల్లి కళ్ళు పెద్దవైనాయి. కన్నార్పక అటే చూస్తూండిపోయింది. కొంతసేపటికి ఆటలు చాలించి ఒక చోట కూచుని ముందున్న మూటలు విప్పి అందులో ఉన్న అన్నాలు తినసాగారు. చుట్టూ పిల్లల మధ్యలో కూచున్న కన్నయ్య అందరికీ నోటికి ముద్దలు అందిస్తున్నాడు. వాళ్ళు పెడితే తానూ తింటున్నాడు. చూస్తున్న చిట్టి తల్లికి ఆ క్షణాన ఆకలేసింది.

- సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

- రమణ ప్రసాద్

21-3-10

శ్రీ సద్గురు దేవులు మనకు ప్రసాదించిన బోధామృతంలో మహావాక్యాలు ఎన్నిసార్లు ఎంత పఠించినా లాభంలేదు. ఆ మహావాక్య స్వరూపాన్ని తాను పొందాలి అన్నారు. ధ్యానం చెయ్యాలి అనుకునే సాధకుడికి తన గుణమే తనకు అడ్డువస్తోంది అన్నారు. అందుకని తన గుణాన్ని తనే దిద్దుకొని దానిని సరిచేసుకుంటే గురు దర్శనం అవుతుంది. సంకీర్తనాదులు, సత్సంగాలు అన్నిటికంటే, ధ్యానము, ప్రార్థన ముఖ్యము అని చెప్పారు. అలా అంటూ సత్యగురుదేవుని బోధ జ్ఞానం కన్నా గొప్పది అన్నారు. సత్సంగం అంటే మామూలుగా మనం విన్నటువంటి మహాత్ముల అమృతపు పలుకులను మనమందరం కలిసి మాట్లాడుకుంటూ ఉండటమే. అది సత్సంగమే కాని మనం అది అనుభవించి మాట్లాడుతున్నామా? లేకపోతే విన్నది చెప్పుకుం టున్నామా? ఒకసారి మనను మనం తరచి చూసుకుంటే అర్థం అవుతుంది. కాని అసలు ఏమీ లేనిదానికంటే, ఇది చాలా మంచిదే. కాని ఆ పలికే పలుకులు ఉత్త పలుకులు కాకుండా, గట్టి పలుకులైతే బాగుంటుంది. మనం అమ్మవారి దగ్గర మంత్రపుష్పంలో దర్బారులో పాడుకుంటాము చూడండి - 'గట్టి జ్ఞానమొసగి నన్నాశీర్వదించుటన్న' అని. గట్టి జ్ఞానం, అంటే గట్టి జ్ఞానం అనేది ఇంకొకటి ఎక్కడన్న ఉన్నదా? ప్రజ్ఞానం ఉన్నది, విజ్ఞానం ఉన్నది, అజ్ఞానం ఉన్నది, సుజ్ఞానం ఉన్నది. గట్టి జ్ఞానమంటే? అనుభవైకమైనది అనుభవజ్ఞానం. అంటే ఏమని? పుస్తక జ్ఞానం పనికిరాదు. అనుభవ వేదాంతం కలిగి ఉండాలి. అంటే అనుభవ వేదాంతం అంటే వైరాగ్యంతో కూడిన జ్ఞానమై ఉండాలి. వేద అంటేనే జ్ఞానము. అనుభవంతో కూడిన జ్ఞానం కలిగి ఉండాలి. అందుకని మహాత్ములు అందించినటువంటి ఆ వాక్యం ఎటువంటి అధారిటీ (author-ity) తో ఉంటుంది? వెతకటానికి ఇంకొకటేమీ కనిపించదు ఆ మహాత్ముల దగ్గర. అక్కడ ఏమున్నది? ఏదైతే వారి వద్ద నుంచి మనకు ప్రసాదితమైనదో అది 100%. అంటే పూర్ణం. మనమేం అనుకుంటున్నాము. ఇటుప్రక్క మాట్లాడుతున్నాము, ఇంకాస్సేపటికి బయటకు వెళ్ళాము. మనకున్న లక్షణాలు బయటపడిపోతూ ఉంటై. ఒకరి మీద ఒకరికి ద్వేషభావనో, లేకపోతే ఒకరిమీద

ఒకరికి నీరస భావనో, లేకపోతే నిరసన భావనో, ఏదో ఒక రసం లేకపోతే ఎట్లా? ఏదో ఒక రసం ఉండాలి. అందుకని ఇటువంటిదంతా కుదరకుండా అక్కడ గురువాక్యం అంటే మనకు సద్గురు దేవులు మనకు ఏది ప్రసాదించారో అది ఆరూఢమైన, పరిపూర్ణమైన జ్ఞానం అన్నమాట. అటువంటి జ్ఞానాన్ని నిరంతరం కూర్చుని మనం ధారణ చేయటం ధ్యానమే. మొన్న కూడ చెప్పారు, ఎన్ని రకాలుగ చెప్పారో, ఎన్ని రకాలుగా అందిస్తున్నారో. ధ్యానం ఎలా చేయాలి అనేది. తాబేలులాగా ముడుచుకోవాలి అన్నారు. అదే భగవద్గీతలో కూడ ఉన్నది. ఇంద్రియాలు విషయాదుల సన్నిధికి వెళ్ళినప్పుడు ఎలా ఉండాలి? తనలోకి తాను ముడుచుకు పోవాలే తప్ప పరిగెత్తి పారిపోవాలని ఎక్కడా లేదు. తిరోగమనం ఎప్పుడూ లేదు. కాకపోతే ఈ జీవితం అంటూ ప్రపంచం లేకపోతే మనం దేనిని గుఱించి సత్యాన్ని అన్వేషిస్తాము. ప్రపంచంలో ఉండాలి, సత్యాన్ని గుర్తించాలి. దాన్ని అనుభవించాలి. దాని యొక్క ఆనందాన్ని మనం పొందాలి. అది నిజమైన ధ్యానం. అంటే పరధ్యాస లేకుండా, అధ్యాస లేకుండా దిధ్యాసలోకి వెళ్తే అది నిజమైన ధ్యానం. అది ఎక్కడ జరుగుతుంది? సద్గురు దేవుల సన్నిధిలో ఉంటేనే, ధ్యానం బాగా కుదురుతుంది. మరొక మాట అన్నారు మొన్న శ్రీ స్వామీజీ వారు చెప్పారు. ఏమని? అయితే గురుదేవుల చెంతనైనా ఉండాలి, ఇంటన్నా ఉండాలి, వెంటన్నా ఉండాలి అని. వెంట ఉన్నా మన గురువుల హెచ్చరిక ఏమిటి? వెంట ఉన్నా వింటూ ఉండాలి సుమా! అని. కప్ప పద్మం క్రిందనే ఉంటుంది, కాని లాభం ఏమున్నది? కాని భ్రమరం వస్తుంది పువ్వులోని తేనెను గ్రోలి వెళ్ళిపోతుంది. కాని ఇంట ఉన్నా, వెంట ఉన్నా వింటూ ఉండాలి. మన ఈ జీవితం అంటూ ఉన్నందుకు, ఇదంతా భగవదర్పితం! ఇదంతా భగవదర్పితం! అని ఊరికే నోటితో అనుకోవటంకాదు. అది భగవదర్పితమే అయి ఉన్నది. ఇంక చెప్పుకొనేదేమున్నది అక్కడ. నీవు తెచ్చుకుంటున్నావు బయటకు మనస్సును అందుకే నానా విధాల బాధలు పడుతున్నావు. అందుకే గురుదేవులయొక్క ప్రతి కదలిక, వారి ఆచరణ, వారు ఆచరించే పద్ధతి చస్తూంటే, ఇది ఎవరికోసం అవతారం అంటే? భక్తుల కోసమే. తన్నాశ్రయించిన శిష్యుని కోసరమే. వారికి అవతారంతో పనిలేదు. వారు అవతరణ తీసుకోకపోతే మనం ఈ పాటికి ఎట్లా ఉండేవాళ్ళమో! వెఱ్ఱి వెంగళప్పలలాగ? ఉండేవాళ్ళం. అవునా? కాదా?

-సశేషం

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

( శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో ది. 28-09-09 శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణకు సంగ్రహ రూపం)

కర్ణుడు అటువంటి దాత అన్నారు. మన మనసులు కూడ చూడండి, వచ్చిన వారికి తృప్తిగా పెట్టి, మనం ఏదో ఒక దానితో కడుపు నింపుకుంటే ఎంత బాగుంటుంది?ఆకలి లేకపోయినా, ఏదో ఒక క్రొత్త వంటకం పేరు వినగానే నోట్లో నీళ్ళూరుతాయి. బ్రతకటం కోసం తినాలి సాధకుడు.

సాధకుడు కానివాడు బ్రతికితే ఎంత, ఛస్తే ఎంత? ప్రభూ! నీవు సమర్థుడవు. నాకు ఏ సమయానికి ఏది కావాలో, దానిని ఆ సమయానికి ప్రసాదించేది నీవే. మరణ సమయంలో నీ నామస్మరణమే గతి. నీ కృపను ప్రసాదించు ప్రభూ! అని సూర్‌దాస్ ఆవేదనతో ఆలపిస్తున్నాడు. పరమాత్మ ఆలకిస్తున్నాడు. మరి ఆ పరమాత్మ ఇప్పుడు లేడా? పరమాత్మ ఇప్పుడూ ఆలకిస్తాడు. సంగీతం అక్కర్లా. భావం ఉంటే చాలు. హార్మోనియమ్ (Harmonium) లేకపోతే భజన ఎట్లా? అని కొందరు అనుకొంటారు. మన అందరి పిలుపులు అందుకొని పలికేవాడు పరమాత్మ. ఎక్కడైతే అందరి మెచ్చుదల కోరుకుంటారో, అక్కడే చెప్పులుకూడ ఉంటై. కాని గురుదేవుల వద్ద ఎప్పుడూ ఆశీస్సులే.

మన సౌందర్యం ఆయన ఇచ్చిందే. కాని అటువంటి సౌందర్యం కావాలి అంటే

**మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే ।**
**మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏవ ఏష ।**
**తద్భృత్యభృత్య పరిచారక భృత్యభృత్య**
**భృత్యస్య భృత్య ఇతి మాం స్మరలోక నాథ ॥**

నా జన్మకు ఇది చాలు. ఇది ఫలం. హే మధుకైటభారే! నిన్ను ప్రార్థిస్తున్నాను. నన్నునుగ్రహించి, ఈ కొంచెం చాలు. ఏది అది? తద్భృత్య భృత్య భృత్యస్య భృత్యస్య భృత్య పరిచారక భృత్యభృత్య పదవి. అది ఎంత పెద్ద పదవి? అనుకొనటానికి చిన్నదిగా ఉంటుంది కాని, అనుభవించేటప్పుడు అది చాల పెద్దది. దుర్యోధనుడు చెడింది దాని వలననే, అహంకారం. అర్జునుడు

యుద్ధానికి వెళ్ళిన తరువాత ఏడ్చి, ఏడ్చి, నాకేది మంచిదో నాకే తెలియదు, దయచేసి, నాకేది మంచిదో అదే దానిని నాకు ప్రసాదించు, శిష్యస్తే**Z**హం శాధి మాంత్వాం ప్రపన్నం అన్నాడు. అప్పుడు భగవద్గీత వచ్చింది.

ఈ రోజుల్లో చాలచోట్ల ఎక్కడ చూచినా హైపర్ టెంక్షన్ (hyper tension) డిప్రెషన్ (depression) etc., ఈ డిప్రెషన్ కూడ బాగుంది. ఎందువలన? భగవంతుని వద్ద ధ్యానంలో ఉన్నాము కనుక. కాని మనస్సుకు డిప్రెషన్ రాకూడదు. ఎందుకంటే భగవంతుడు శరణాగతత్రాణ పరాయణుడు. అర్జునుడు ఏడ్చి, ఏడ్చి తన దోషం ఏమిటో గుర్తించాడు. మనం కూడ మన దోషాలను గుర్తించాలి. వాడు అంతమాట అన్నాడే అనుకో, అయినా నేను అనకుండా ఉంటే సరిపోతుంది కదా! అని సరిపెట్టుకోవాలి. మనస్సు రెచ్చిపోకూడదు. దానిని సమాధాన పరచుకోవాలి.

అర్జునుడు ఆలోచించి. చించి, చించి ఏమన్నాడు? ఒక్కటే మార్గం. దేవుడికి దగ్గరకు వెళ్ళి దణ్ణం పెట్టుకోవటం. మాట్లాడే దేవులు, అంటే గురుదేవులు చెప్తారు, అభిషేకం చేసుకో, నీపని అవుతుంది అనో, లేకపోతే ఇంకా కర్మ మిగిలి ఉంది అనో. వీడు అది చేయలేడు సరే అయితే, గోత్రం, పేరుతో డబ్బు కట్టండి. అలా కూడా ఆయన అన్ని కోర్కెలు అనంతంగా తీరుస్తున్నాడు.మనం మనసారా ప్రార్థించటంలో ఉంది. అభిషేకానికి 7గం॥ 30నిలకు॥ వస్తామంటే ఎలా కుదురుతుంది? 4గం॥ 30॥నిలకే ఇక్కడ అభిషేకం చేస్తారు. వచ్చి మహాత్ముల దర్శనం, వారికి పాదాభివందనం చేసుకోవాలి. ఇక్కడ పద్ధతి ఎలా ఉంది అనేది చూడాలి.

మన దోషం గుర్తించినప్పుడు ఎంత ఆవేదన కలుగుతుంది. అదే ఇంకొకరు అడిగితే అహంకారం వస్తుంది. అదే గురుదేవులే నిన్ను అనలేదురా, నీలో ఉన్న ఆ అహంకారాన్ని అన్నాను అంటే, మనం పిచ్చిముండావాళ్ళలా, దాన్ని అన్నారట, మనను కాదు అనుకుంటాము. అర్జునుడు ముందు కులధర్మాలు నాశనం అవుతాయని, ధర్మేనష్ట్యం కులకృష్ణ, స్త్రీషు దుష్టాసు వార్షేయ జాయతే వర్ణ సంకరః అని త్రైలోక్య రాజ్యాదిపత్యం ఇచ్చినా నేను ఈ యుద్ధం చేయను అని ఏదేదో పేలాడు, వాగాడు, ఏడ్చాడు. ఇక నా అన్న వాళ్ళు తప్ప వేరే ఎవ్వరూ లేరూ అని ప్రేమంతా కార్చాడు. అప్పుడు తనను తాను తరచి చూసుకున్నాడు. నీవు కూడ, నిను నీవు తరచి చూసుకోవాలి. అన్నట్లు ఎవరైనా పడేవాళ్ళు ఉంటే తలఎత్తి మాట్లాడతారు. లేకపోతే కాస్త దిగి మాట్లాడతారు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు. -సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

మదిలో నీదగు మూర్తి నిల్పికొని సంభావింతుమే గాని ని
న్నిదమిత్థంబని నిర్ణయింప వశమా? యెవ్వారికిన్ నమ్మి నీ
పద రాజీవములాశ్రయించితిమి లోపంబేమి? నీ వారమే
గద, రక్షింపక నీకు తప్పదు కదా! కాళీ ప్రసాద ప్రభూ

మనం చెప్పుకొనే విషయం ఏదైై ఉన్నది? చెప్తుంటే ఏ విషయంపైన నీ మనస్సు లగ్నమవుతోంది? తత్త్వం నిత్యనూతనంగా ఉంటుంది. రోజూ చేసే భోజనమే. రోజూ వేసుకొనే అవకాయే. ఆస్వాదించటంలో తేడా ఉంటోంది. కొత్త అనుభూతి కలుగుతోంది. మరి సత్య వస్తువు యొక్క అనుభూతో! అది నిత్యమైనది. ఇంద్రియాలకు మైన్ స్విచ్ మనస్సు.

ఒక ఇంటికి అన్ని కనెక్షన్స్ ఇచ్చారు. కాని కరెంట్ వైరు లాగలేదు. ఇంట్లో చీకటే ఉంటుంది కదా.! కాని నీ ఇంట్లో కరెంట్ ఉంది. ఉన్నట్లుండి లైట్లు పోయాయి. అప్పుడు పక్కఇంట్లో చూస్తాం. అక్కడా లైట్లు లేకపోతే అంతటా పోయాయి అని ఊరుకుంటాము. మన ఇంట్లోనే పోతే కరెంట్ వాళ్ళను అడుగుతాం. ఉన్నచోటనే ఉండి మనస్సు ఎన్నో విషయాలను ఆలోచిస్తుంది. ఇన్న ఉపాధులలో ఉన్న సత్యవస్తువును సత్యంగా చూడగలగాలి. ఆ సత్యవస్తువు సత్తావల్లే మనం మన జీవితాలను నడుపుకొస్తున్నాం. బయట ఉన్న దీపం మన కంటికి కనిపిస్తోంది. కన్నుమూస్తే కనిపించదు. కాని కన్నుకు చూసే శక్తి ఉంది. చీకటిని చూస్తుంది. కన్నుతెరిస్తే బయట ప్రపంచం చూస్తాం. కన్ను మూస్తే కంటి రెప్పను చూస్తాం. అదేవిధంగా పరమాత్మ వస్తువే కన్ను అనే గోళకం ద్వారా బయట చూస్తుంది. మనస్సును ఆత్మతో అనుసంధానం చేయాలి. ఆ ఆత్మ ప్రకాశాన్ని గుర్తించాలంటే నిరంతర ప్రార్థనాదికాలు చేయాలి.

మాయజాలమున మునిగేవు నరుడా, దారి తెలియక తడబాటు ఏలా
జ్ఞాన నేత్రమున వెదకి చూడుమా, శాశ్వతజ్యోతి కనుగొనుమా॥
మదిలో కల్లోలము విడరా మనసున గల దేవుని కనరా
జీవిత సమర విహారములోన దీక్షా ధైర్యము జయభేరిరా
నీజీవిత నిర్మాతవు నీవే నీ కృషియే ఇల ఫలియించు రా
జీవుడిలో శివుడున్నాడురా ఆ శివుడే జగదాధారి రా॥

ఒకాయన లాంతరు వెలిగించాడు. కాని కాంతి కనిపించలా. కారణం

లాంతరు గ్లాసు మసి పట్టిఉంది. తెలిసిన ఆయన వచ్చి లాంతరు లోపల తుడవాలి. అని చెప్పాడు. అలాగే మన మనస్సుకు పట్టిన మసి తుడవాలి. అది సబ్బులతో తుడవబడదు. భగవన్నామంతో తత్త్వ విచారణతో మనస్సును శుద్ధం చేయాలి. ఏది లేదు? ఏది లేదు? అని విచారిస్తే ఉన్నది ఏదో తెలుస్తుంది. ఒకాయన కొంతకాలంగా ఇంటికి తాళంవేసి వెళ్ళాడు. వచ్చి తలుపు తీశాడు. దుమ్ము. దూగర. వాటిని తొలగిస్తే కాంతి వచ్చింది. మనం తొలగించాల్సింది పరిశుభ్రం చేయాల్సింది బయటకాదు. లోపలచేసుకోవాలి అందుకే 'జ్ఞాన నేత్రమున వెదకి చూడుమా' అన్నారు ఈ పాటలో. బయట వ్యక్తిత్వాన్ని చూస్తున్నావు. తత్త్వ విచారణ ద్వారా మనస్సే జ్ఞాననేత్రంగా మారిపోతుంది. ఉచ్చ నీచాలు,రాగ ద్వేషాలు తొలిగాయా, లేదా? అని చూసుకోవాలి. జ్ఞాన నేత్రంతో శాశ్వతజ్యోతిని చూడాలి. నిరంతర భగవన్నామస్మరణ ఎంతో తోడ్పడుతుంది.

తిన్నడు కాళహస్తీశ్వరుని వద్ద ఒక అర్చకుడు పూజ చేయటం చూశాడు. పూజ అంటే ఇంతే కామోసు అనుకున్నాడు. తిన్నడి దృష్టి అక్కడ ఉన్న శివలింగం మీద పడింది. ఆ శివ లింగానికి నమస్కారం పెట్టాడు. తరవాత నిర్మాల్యం తీశాడు. నదినుండి నీరు పుక్కిట పట్టి శివునికి అభిషేకం చేశాడు. ఆకులు,పువ్వులు తెచ్చి వేశాడు. ఒక అడివిపందినికొట్టి దాని మాంసాన్ని చిదుపుల మంటలో రోస్ట్ చేశాడు. అది సరిగ్గా కాలిందో లేదో అని కొద్దిగా కొరికి చూశాడు. ఒక పెద్ద ఆకులో పెట్టి శివుడికి నైవేద్యంగా పెట్టాడు.

ఈ విషయాన్నే శ్రీశంకరులు తమ శివానందలహరిలో -

**మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే**
**గండూషాంబు నిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే**
**కించిద్భక్షిత మాంస శేష కబలం నవ్యోపహారాయతే**
**భక్తిః కిం న కరోత్యహో! వనచరో భక్తావతంసాయతే**

భగవంతుని గురించి తెలిసినవాడెవ్వడు? భక్తుడే! ఎడ్వర్‌టైజ్‌మెంట్ విని విని ఆ కంపెనీ బల్బు కొంటావు. నిన్ను చూసి ఇంకొకరు కొంటారు. అలాగే హరిభక్తుడి హృదయానికి ఇంకొక హృదయం హత్తుకుపోతుంది. తిన్నడు శివునివైపు చూశాడు.శివుని కుడి కంట్లోనుంచి రక్తం కారుతోంది. వెంటనే ఏవో ఆకులు తెచ్చి వాటి పసరు కంట్లో పిండాడు. అప్పుడు తిన్నడికి ఒక ఉపాయం తోపించాడు భగవంతుడు. కన్నుకు కన్నే మందు అనుకొన్నాడు తిన్నడు.

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

## త్యాగభావన

జగత్తునంతా జయించవలెననే కాంక్షతో అలెగ్జాండరు చక్రవర్తి మన దేశంపై దండెత్తి వచ్చినట్లు చరిత్ర చెపుతూ ఉన్నది. అతడు సాటిలేని మహా వీరుడేకాక, ఆధ్యాత్మిక సాధనయందు ప్రత్యేకాభిమానం కలిగిన వాడు కూడా. ముఖ్యముగా ఈ దేశాన్ని జయించాలనే కోర్కెతోనే అతడిచటికి వచ్చినమాట నిజం. కాని ఈ దివ్య భూమి ఆధ్యాత్మిక మహిమ యెట్టిదో కొంతగానైనా తెలుసుకోవాలని, వీలైతే అందు కొంత ప్రవేశం కల్పించుకోవాలని కోర్కె కూడా అతనిలో దాగి ఉన్నది.

అదృష్టవశాత్తూ అతనికి తొలుత, ధీరోదాత్తుడగు పురుషోత్తమ ప్రభునితో మొదట వైరిగానూ, అటుపిమ్మట మిత్రుడుగానూ పరిచయం యేర్పడింది. యుద్ధ సమయంలో గొప్ప పరాక్రమం చూపుటేగాక, ఉత్తమ క్షత్రియునకుండదగిన ఆత్మాభిమానమును గూడా అత్యంత ఘనముగా పురుషోత్తముడు ప్రదర్శించుసరికి, భారతదేశ మహత్వపు హిమాలయ శిఖర మహోన్నతులు సైతం అతనిలో అలెగ్జాండరునకు పొడగయినవి.

ఒకనాడు అలెగ్జాండరు తన ఆధ్యాత్మిక తృష్ణను తీర్చుకొనే ఉద్దేశ్యంతో ఒక కారడవి ప్రవేశించగా అచట అస్థి పంజరం వలె బక్కచిక్కిన ఒక వృద్ధ తపస్వి ధ్యాన నిమగ్నుడై అతనికి కనిపించాడు. సముచిత గౌరవభావ మాయనయెడ ప్రకటిస్తూ అతడాయనను పలుకరింప జూచినాడుగాని, కన్ను విప్పియైన ఆయన తనను చూడకపోయే సరికి, తన రాజసాహంకారానికి దెబ్బ తగిలినట్లుకాగా అతడు తన వరలోని కత్తిదూసి ఒక్క వేటున ఆయనను తెగవేయ జూచినాడు.

కాని, ఆశ్చర్యం ఎత్తిన చెయ్యి ఎత్తినట్లే స్తంభించిపోయింది. అతడు విస్తుపోయి నిలబడియుండగా ఆ తపస్వి నెమ్మదిగా కనువిచ్చి చూచి చిరు నవ్వుతో "ఒఫ్ సార్వభౌమా! నీ పరాక్రమం ఎల్ల చోటులా అక్కరకు వస్తుందని విశ్వసించకు. కత్తికి తెగనిది, నిప్పు తగులబెట్టలేనిది, నీరు తడుపజాలనిది వస్తువు ఒకటున్నది. అది సర్వ వ్యాపకం, సర్వ ప్రకాశకం, స్వయం ప్రకాశమానం. అదియే పరమాత్మ, దాని శక్తి అనంతం. దానిని నీవు భక్తితో వశపరచుకోగలిగినప్పుడు మాత్రమే అనంతశక్తిమంతుడవై నీవు అజేయుడవు కాగలుగుతావు.

ఆ శక్తిని నీవు పొందగోరినట్లయితే, విజ్ఞానమనే ఖడ్గాన్ని, వైరాగ్యమనే

కవచాన్ని ధరించి నీలోని కామ, క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యములనే అంతః శత్రువులను వీరాధి వీరుడవై నిర్జించ వలసి ఉంటుంది. నీలోని పరమాత్మ దర్శనం నీకు కలుగనీయకుండా చేస్తున్నది ఈ అంతశ్శత్రు సముదాయమే.''

ఈ దివ్య సందేశాన్ని అందుకోవలసి యుండియే అలెగ్జాండరు ఈ దేశమునకు వచ్చినాడు - అందుకొని ధన్యుడైనాడు.

ఒకానొక విస్తృత రాజ్యమునకు ఏకవారసుడైన సిద్ధార్థుని అంతరంగం తోటి మానవులు పొందే దుఃఖములను, తప్పనిసరి యగుచున్న జరామరణములనూ గాంచి సంక్షోభితమై పోయినది. తరుణ వయస్సులోని మహా సౌందర్యవతియగు భార్యను, కొత్తగా పుట్టిన ఒకే ఒక ముద్దు కుమారుని వదలివేసి, ఈ జననమరణ రూప విషవలయపు రహస్యాన్ని కనుగొనడానికై నిర్విరామ తపస్సు కొనసాగించినాడు. ఎట్టకేలకు ఆ తపస్సు ఫలించి, విజ్ఞానోదయమై బుద్ధదేవుడుగా అతడు విఖ్యాతుడైనాడు. మానవజాతి దుఃఖాలనెల్ల శాశ్వతంగా తుదముట్టించుట కాయన కనుగొన్న మహామంత్రము ''అహింసా పరమోధర్మః'' అనునది.

ఇదియే ఆయన చేతిలో సుదర్శన చక్రమై విలసిల్లినది. మానవునిలోని హింసా ప్రవృత్తిని, అధర్మాన్ని, స్వార్థాన్ని దీనితోనే మహావీరుడై నిర్జించుటేగాక, సకల మానవుల హృదయ సీమలను గూడా చూరగొన్నాడు. సత్యము, ధర్మము, శాంతి, దయ, ప్రేమ, అహింస - మొదలైన సత్ప్రవృత్తులే ఆకులుగా విలసిల్లిన ఈ చక్రమునకే 'ధర్మచక్ర'మను ప్రఖ్యాతి యేర్పడినది.

మహా పరాక్రమ శాలియైన అశోక చక్రవర్తి కళింగ యుద్ధాన్ని విజృంభించి, లక్షలాది జనుల మారణహోమమునకు కారణభూతుడవుతున్న సందర్భంలో, అతని నా ఘోర వ్యాపారమునుండి మరల్చి ఆయుధ విసర్జన చేయించినది ఈ ధర్మ చక్రమే. అశోకుని న్యాయ పరిపాలనమునకీ చక్రం ప్రతీకగా విలసిల్లుట చేతనే అటు తరువాత దీనికి 'అశోక చక్ర' మనే పేరు రూఢమైనది.

మానవుడు సాధించవసింది జ్ఞానికి ఉండదగిన ఈ విశాల సమ్యక్ దృష్టినే, మహాత్ములు ప్రసరింపజేసే ఈ కారుణ్య దృష్టి ప్రసారపు నీడలోనే భగవత్సృష్టిలో సమస్త ప్రాణులూ శాంతి సౌఖ్యాభ్యుదయములతో జీవించగలుగుతూ ఉంటాయి అని శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ ఉద్బోధ. *

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

బాలసాధువు గారిని తమ యింటికి భోజనానికి తీసుకుని వెళ్ళటానికి వచ్చిన కామయ్య శాస్త్రిగారు, శ్రీబాబును చూసేసరికి దిగ్భ్రాంతి పొందారు. చెరువు గట్టున చూసిన బాలుడు, హిమాలయాలలో దర్శనమిచ్చిన వృద్ధ తాపసి, ఇప్పుడిక్కడ బాల సాధువు రూపంలో కనిపిస్తున్న బ్రహ్మ తేజస్కుడు - ఒకరిని మార్చి ఒకరు - ఆయన కళ్ళ ముందు చిరునవ్వులు చిందిస్తూ కనిపించ సాగారు. కామయ్య శాస్త్రిగారు అంగవస్త్రం నడుముకు బిగించి, "పాహిమాం!" అంటూ శ్రీబాబు పాదాలపై సాష్టాంగంగా పడిపోయారు.



శాస్త్రిగారు శుద్ధ శ్రోత్రియ నిష్ఠాగరిష్ఠులని, మహా పండితులని, ఆ ఊరిలో జనం చాలా గౌరవం చూపించేవారు. అందరూ ఆయనకు వందనం చేయటమే గాని, ఆయన ఏ మానవునికీ యిలా నమస్కారం, అందులోనూ సాష్టాంగ నమస్కారం చేయగా వాళ్ళు చూడలేదు. అంతటి శాస్త్రిగారు ఇప్పుడీ "బాల సాధువు"కు యిలా సాష్టాంగపడేసరికి, యీ బాల సాధువు ఎంత గొప్పవారై ఉండాలో అనిపించి, వాళ్ళకు శ్రీబాబు యెడల అపార గౌరవము, భక్తితో కూడిన ఒకింత భయము కూడ కలిగాయి.

సాష్టాంగ పడిన శాస్త్రిగారితో శ్రీబాబు "శాస్త్రిగారూ! తమరు పెద్దలు, తమరిలా చేయకూడదు. లేవండి" అన్నారు. శాస్త్రిగారు లేచి, చేతులు కట్టుకొని నిల్చుని "మహాత్మా! ఉదయం తమరు చెరువు గట్టున దర్శనమిచ్చి నన్ను ధన్యుణ్ణి చేశారు. అంతలోనే అదృశ్యమయ్యారు. మా గృహం పావనం చేయకుండానే వెళ్ళిపోయారేమోనని చాల ఆవేదన పొందాను" అన్నారు.

అంతలో శ్రీబాబు ఎదురుగానే ఉన్న చెరువుగట్టు వైపు చూపుతూ, "అమ్మ" అన్నారు. శాస్త్రిగారు అటు చూసేసరికి, వారి శ్రీమతిగారు చెరువులో కాళ్ళు చేతులు కడుక్కొని పైకి వస్తూ కనిపించారు. ఆమె ఆ ముందు రోజునే

ఊరు వెళ్ళారు. శాస్త్రిగారు ఆశ్చర్యపోతూ "ఆమె నా భార్య" అన్నారు. శ్రీబాబు "తెలుసునండి. అందుకే అమ్మ వచ్చారని మీకు చూపించాను" అన్నారు. శాస్త్రి గారు "ఆమె వారం రోజులదాకా రానని చెప్పి వెళ్ళింది. ఇవాళ వస్తుందని, తమ దర్శన భాగ్యం ఆమెకు కూడా కలుగుతుందని, నేను అనుకోలేదు" అన్నారు. "కానీ నేను అనుకున్నాను లెండి. అందుకనే, ప్రొద్దున నన్ను తమరు తమ గృహానికి రమ్మంటే, అమ్మ కూడా వచ్చాక మీ యింటికి వచ్చి, మీ పుణ్య దంపతుల దర్శన భాగ్యం పొందవచ్చును కదా అని రాలేదు" అన్నారు.

"ధన్యోస్మి" అనుకుంటూ శాస్త్రిగారు త్వర త్వరగా వెళ్ళి, తమ ధర్మ పత్నిని శ్రీబాబు వద్దకు తీసుకుని వచ్చి, "వీరే, ఆనాడు నేను హిమాలయాలకు వెళ్ళిపోతే, అక్కడ నాకు వృద్ధ తపస్విగా దర్శనమిచ్చి, తిరిగి యింటికి పంపిన మహనీయులు. ఈనాడు యిలా మనం పిల్లా పాపలతో, సుఖ శాంతులతో జీవించ గలగటం యీ మహాత్ముని వర ప్రసాదమే" అని చెప్పారు. ఇరువురు కలిసి శ్రీబాబుకు సాష్టాంగ వందనం చేసుకున్నారు. "అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములతోను, సమస్త భోగ భాగ్యములతోను, జగన్మాత మిమ్ములను సర్వదా రక్షించుగాక!" అని శ్రీబాబు వారిని ఆశీర్వదించారు. శాస్త్రిగారు శ్రీబాబును తమ యింటికి తీసుకొని వెళ్ళారు. బాలసాధువు దివ్యత్వాన్ని గుర్తించిన జనం ఆనందాశ్చర్యాలకు మేర లేదు.

అప్పటి నుండి శాస్త్రి గారు, వారి కుటుంబ సభ్యులు శ్రీబాబుకు పరమ భక్తులైనారు. వారి కుమారులు శ్రీవెంకట రావుగారు, శ్రీదక్షిణామూర్తి గారు ఎంతో విశ్వాసంతో యిప్పటికీ ఆశ్రమానికి వస్తూ ఉంటారు.

ఆ విధంగా కోరుకొల్లుకు తమకు తామై వచ్చిన శ్రీ బాబు, అక్కడ కొన్ని రోజులుండిపోయారు. తరువాత కూడా, ఎప్పుడు కోరుకొల్లు వచ్చినా ఆ మండువా యింట్లోనే ఉండేవారు. అక్కడే చాప మీద పడుకునే వారు. దర్శనార్థమై వచ్చిన వారితో ఆ యింటి అరుగుపై కూర్చుని మాట్లాడేవారు. తమ దేవతార్చన మాత్రం కామయ్య శాస్త్రిగారింట్లో ఉంచి, అక్కడనే పూజ, నివేదన చేసుకొనే వారు. శ్రీ బాబు తెల్లవారు ఝామునే లేచేవారు. కృష్ణంరాజు గారితో బాటు వారి పొలం వద్దకు వెళ్ళే వారు. రాజుగారు పొలం పనులు చూసుకుంటుంటే శ్రీ బాబు దగ్గరలోనే ఉన్న చెరువులో స్నానం చేసే వారు. కట్టుకున్న వస్త్రాలు ఉతికి ఆరవేసుకొనే వారు. చెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేసుకునే వారు. బట్టలు ఆరిన తరువాత తిరిగి వాటిని ధరించే వారు.

కృష్ణంరాజుగారు మొదట్లో శ్రీబాబును కొంచెం చులకన భావంతోనే చూసేవారు. ఆయన ఒకసారి శ్రీబాబును తమ చెయ్యి చూడమని అందించారు. శ్రీబాబు ఆయన చేయి చూస్తూ, అనేక విషయాలు చెబుతూ, చెయ్యి వెనక్కి తిప్పి చూశారు. శ్రీబాబు తన ఉంగరం వైపే చూస్తున్నారని, అది తనకు కావాలని అడుగుతారేమోనని, కృష్ణంరాజుగారు మనస్సులో అనుకున్నారు. "నీ ఉంగరం నాకు అక్కర్లేదు లేవయ్యా! కంగారు పడకు" అని శ్రీబాబు అనేసరికి బిత్తరపోయి, అటువంటి నీచపు ఆలోచన వచ్చినందుకు పశ్చాత్తాప పడ్డారు కృష్ణంరాజుగారు. ఏదో విద్యను ప్రదర్శించి పొట్టపోసుకొనే వాడని అపార్థం చేసుకుని మహాపరాధం చేశానని, అడిగిన వారికి, అడగని వారికి కూడా తమంతట తామే ఎన్నెన్నో సమస్యలు తీర్చి, సంపదలను చేకూర్చి సత్ప్రవర్తన కలిగించి, ఎన్నడూ ఎవ్వరినీ ఒక్క పైస కూడా అడగని, ఇచ్చినా పుచ్చుకోని పరమ వైరాగ్య మూర్తిని, వాత్సల్య మూర్తిని శంకించి తనకు తానే ద్రోహం చేసుకున్నానని, కృష్ణంరాజు గారు ఆవేదనతో ఖిన్నులైనారు. శ్రీబాబు "ఫరవాలేదు లెండి రాజుగారూ! పొరపాటు చేశానని గ్రహించారు కనుక, యిక ఆ పొరపాటు మళ్ళీ చేయకండి చాలు" అన్నారు.

శ్రీబాబు వద్ద ఉన్న దేవతార్చన పెట్టెలో నుంచి అనేక శబ్దాలు వస్తూ ఉండటమును గమనించిన కొందరు, శ్రీబాబును "అందులో ఏమున్నది?" అని అడిగారు. "నా జగన్మాతయే నాకున్న సర్వస్వము. అంతకంటే ఏమున్నది?" అన్నారు శ్రీబాబు. అయినా, కుతూహలం ఆపుకోలేని కొందరు దాన్ని ఎలాగైనా తెరచి చూడాలని చాలా ప్రయత్నించారు. కాని శ్రీబాబు ఎప్పుడూ దానిని తమ వద్దనే ఉంచుకోవటం వలన వీలు కాలేదు.

ఒకసారి శ్రీబాబు స్నానమునకు వెళ్ళిన సమయంలో, ఒకతను ఎలాగో అవకాశం చిక్కించుకొని ఆ పెట్టెను తెరిచే ప్రయత్నం చేశాడు. పెట్టె మీద చెయ్యి వేసే సరికి, ఎవరో బలంగా ఒక్క త్రోపు తోసినట్లు ఎగిరి వెనక్కుపడి గోడకు కొట్టుకున్నాడు. వానికి ఎముకలు విరిగేటంత ఒణుకు, ఏదో ప్రేలాపన మొదలైంది. స్నానం చేసి వచ్చిన శ్రీబాబు అతనిని చూసి విషయం గ్రహించి, ఇక ఎన్నడూ అటువంటి పని చేయవద్దని మందలించి, పూజా కుంకుమను అతని నొసట ఉంచారు. అతడి భయం తగ్గిపోయింది.

-సశేషం

# ప్రయాణకాలే z పి చ మాం తే విదుర్యుక్త చేతసః

(గతసంచిక తరువాయి) - సూర్య నారాయణ గుప్త

భగవద్గీతలో అలనాడు శ్రీకృష్ణ భగవానుడు స్పష్టంగా చెప్పాడు కదా-

**అంతకాలేచ మామేవ స్వరన్ముక్త్వా కళేబరమ్**
**యః ప్రయాతి త్యజన్ దేహమ్ సయాతి పరమాం గతిమ్**
**సాధిభూతాధి దైవంమాం సాధి యజ్ఞంచ యే విదు**
**ప్రయాణ కాలే z పిచమాం తే విద్యుర్యుక్త చేతసః**

అని అంత్యకాలంలో ఎవరు తననే స్మరిస్తూ దేహాన్ని విడుస్తారో వారు తననే పొందుతారు అని, ప్రయాణ సమయంలో అయినా సరే అధి భూతము, అధి దైవము, అన్నీ నేనే అని తెలిసి జ్ఞానమును పొందుతారు. ఆ జ్ఞానాన్ని మరణం కూడ వారినుండి విడదీయలేదు అని, అటువంటి జ్ఞానం ఎవరికి కలుగుతుందో అట్టి జ్ఞానికి తనకు భేదం లేదు అని శ్రీ బాబు ఎన్నోసార్లు చెప్పేవారు. పులి నోట పడిన వాడైనా తప్పించుకో గలడేమోగాని, ఒక్కసారి నన్ను శరణు అంటే చాలు, ఇక వాడు తప్పించుకోలేడు. నేను కామవరపు జీడిని, మోక్షమును ప్రసాదించి గురుసాయుజ్యము పొందేదాక అతడిని విడిచిపెట్టను" అట్టి గురుదేవులు తమ సత్యవాక్యాలకు మచ్చరానిస్తారా? మరి ఇక ఆ గురుదేవులు తమ సర్వశక్తులను ధారపోసి వారిని పూర్ణాధికారినిగా చేశారో, ఎవరు ఆ గురుతత్త్వం యొక్క స్వరూపం అయి ఉన్నారో, ఆ గురు పరంపరలోని శ్రీమాతాజీ వారు మాత్రం దానికి భిన్నంగా ఎలా ఉండగలరు?

అంత్యకాలంలో, నిర్ణయకాలంలో ఏది చేయాలో అది చేసి, వారిని తమలో ఐక్యం చేసుకున్నారు. మా మామయ్యగారు నిజంగా ఎంతో ధన్యాత్ములు. వేలకువేల సంవత్సరాలు అరణ్యాలలో శరీరాలను కృశింప చేసుకుంటూ తపస్సులు చేసినవారికి, తమ జీవితకాలమంతా వేదాలు వల్లె వేసినవారికి, దేవతలకు కూడ అలభ్యమైన మోక్షపదాన్ని, కేవలం అంతిమ క్షణంలో గురుదేవుని రూపంపైన మనస్సును కేంద్రీకరించి, పొందగలిగారు. వారి భాగ్యమే భాగ్యము.

ఔను మా మామయ్యగారిని 8వతేది సాయంత్రమే గురుమాత తమలో లీనం చేసుకోవచ్చు కదా! 10వ తారీకు దాక ఉంచి అప్పుడు ఎందుకు లీనం చేసుకున్నట్లు? అని ఉన్నట్లుండి నా బుద్ధిలో ఒక సందేహం కలిగింది.

దేహం అంటూ ఉంటే సందేహాలు కలుగుతూనే ఉంటాయి అనుకుంటాము. ఏమో బహుశ అప్పటిదాక కర్మశేషం ఉండి ఉంటుంది అని నా మిడిమిడి వేదాంత జ్ఞానంతో మనస్సును అప్పటికి సమాధాన పరచగలిగాను.

కాని తరువాత పురోహితులు మీ మామయ్యగారు నిజంగా అదృష్టవంతులండి. ఆయన 8వ తారీఖునే గనుక పోయిఉంటే, అది ధనిష్ఠా పంచకంలో ఉయి ఉండేది. ఇప్పుడు చూడండి వారు ఏకాదశి గడియలలో కాలం చేశారు. వారు భౌతికకాయానికి ద్వాదశినాడు సంస్కారం జరుగుతున్నది, ఇది ఎంతో విశేషం అంటే, అప్పుడు కాని నాకు శ్రీ మాతాజీవారు ఏది చేసినా, అది ఎంత సమగ్రంగా, నిర్దుష్టంగా, ఉంటుందో తెలియలేదు.

శ్రీమాతాజీ అంతకు పూర్వం వారి ధర్మపత్ని విషయంలో కూడ, వారి అంత్యకాలంలో స్వయంగా హైద్రాబాద్ వెళ్ళి, ఆమెకు దర్శనం ఇచ్చి ఆమెకు కూడ ఏకాదశి మరణం, ద్వాదశి దహనం ప్రసాదించారు. అలా శ్రీమాతాజీ వారిద్దరికీ ఏకాదశి ఘడియలలో మరణాన్ని, ద్వాదశి ఘడియలలో దహన సంస్కారాలను ప్రసాదించి, తమ పాదాల చెంత వారికి శాశ్వత స్థానాన్ని ప్రసాదించారు.

నా గురుదేవులు పరమ కరుణా సముద్రులు. వారికి మన భోగభాగ్యాలు అవసరం లేదు, అందరికీ అన్ని భోగభాగ్యాలను ప్రసాదించే వారికి ఈ ప్రాకృతికమైన భోగభాగ్యాలతో పనేమున్నది? వారు కోరింది మన మనస్సును. సంకల్ప వికల్పాత్మకమైన ఆ మనస్సును వారికి సమర్పించుకుంటే, వారు దానిని పవిత్రం చేసి తిరిగి మనకే ఇస్తారు. అప్పుడు మనకు ఉన్నదానిని ఉన్నట్లుగా చూసే శక్తి కలుగుతుంది. కాని అంతదాక... అంతవరకు భ్రమా జనితమైన మాయాశక్తి మనను సత్యదృష్టినుంచి దూరం చేస్తుంది. వాస్తవానికి పై సంఘటనను మా బంధువర్గం అందరూ ప్రత్యక్షంగా చూశారు. అంతటి అనుభవం కలిగినా, కేవలం వారిది శ్మశాన వైరాగ్యం మాత్రమే, అదీ కొందరికే కలిగింది గాని, సత్యాన్ని గుర్తించిన వారెవరూ లేరు. గురుదేవులకు నా ప్రార్థన ఒక్కటే, ఆ మాయా ప్రభావం నామీద పడకుండా ఉండాలనీ, ఈ జీవి ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, నాలో నిరంతరం గురునామ స్మరణ జరుగుతూనే ఉండాలని, బ్రతికి ఉండగానే మరణించి, నా గురుదేవుల పాదపద్మముల చెంత శాశ్వత స్థానాన్ని పొందే అర్హత కావాలనీ, గురుదేవులు నాకట్టి మహద్భాగ్యాన్ని ప్రసాదించాలి అని - జై గురుదేవ్. *

# అమెరికాలో శ్రీ మాతాజీ

(గతసంచిక తరువాయి)

**(ది. 12.06.2010 న్యూజెర్సీ, అమెరికాలో శ్రీ మాతాజీ వారి అనుగ్రహ భాషణ సంగ్రహరూపం) -శివప్రసాద్**

ఆకలిగొన్నవాడు విస్తరిముందు కూర్చుని అది ఎలా చేశారు? ఇది ఎలాచేశారు అంటాడా? అనడు. గబా గబా వేసినవి అన్నీ కలుపుకుని తినేస్తాడు. ఆకలి లేనివాడు ఏం చేస్తాడు? వంకాయకూర ఇంకా కొంచెం మగ్గనిస్తే బాగుంటుంది అంటాడు. ఆకలిగొన్నవాడు వేసినవన్నీ భగవంతుడి ప్రసాదంగా తింటాడు. భగవత్ప్రేరితముగా భావించి ఎంతో భక్తిభావంతో తింటాడు. అలాగే మన జీవితం కూడ వడ్డించిన విస్తరి. ఇన్ని ఉన్నా , అనుభవించటానికి మనకు ఈ జీవితాన్ని ఇచ్చాడు. ఈ జీవితం అంటూ లేకపోతే మనం ఇవన్నీ అనుభవించలేము. ఎవరి జీవితం వాళ్ళకు గొప్పది. జీవితం బావుంటేనే తత్తిమావన్నీ - దేవుడు ,దైవం, ద్వంధము, వికృతి, ప్రకృతి - కదా! దేవుడు ఏ రూపంలో అయినా రానీయండి, ఏడుకొండలవాడననీయండి, దేవుడవనీయండి, నేనవనీయండి. వీడు బాగుంటేనే అన్నీ బాగుంటాయి.

భగవంతుడు ఇచ్చిన ఈ జీవితాన్ని మనం సార్థకం చేసికోవాలి. కాలాన్ని సద్వినియోగపర్చుకోవాలి. అలాగని పనులన్నీ మానేసికూర్చుంటానంటే శ్రీ గురుదేవులు ఎప్పుడూ ఒప్పుకొనేవారు కాదు. 'నువ్వు పనులన్నీ మానేసి కూర్చుంటానంటే సోమరితనం అంటారు దాన్ని' అనేవారు గురుదేవులు. నీకు కొంత స్వధర్మం ఉంది. ఎడమచెయ్యి ఒక పాదంపై ఉంచి నీ స్వధర్మాన్ని నెరవేర్చు. తరువాత నీ కుడిచెయ్యి రెండవ పాదంపై పెట్టు. పనులు వచ్చినప్పుడు నీ కుడిచేతితో పనులు చేసికొనివచ్చి ఆ పాదం వద్దకు చేర్చు. అంటే నువిప్పుడు ఎక్కడ ఉన్నట్టు? భగవంతుడి దగ్గర ఉన్నట్టేగా. నీలో భగవచ్ఛక్తి ఉంది. అదే నీ ఉనికి. నీ ప్రాణం. ప్రాణం ఇంతవరకు ఎవరికైనా కనిపించిందా? డాక్టర్లు కూడా చూడలేరు. ఏదో వాళ్ళకు తెలిసిన ట్రీట్‌మెంట్ ఇస్తారు తప్ప ప్రాణాన్ని నిలబెట్టేవారు ఎవరూ లేరు. మొన్న భీమవరంలో చంపక అనే భక్తురాలు - ఇంకేముంది,మూడు గంటలలో పోతుంది అన్నారు డాక్టర్లు. మూడు రోజులైంది. వెళ్ళలేదు. ఈయనేమో(గురుదేవులు) ఆశ్రమంనుండి అలా చూస్తున్నాడు. ఆమేమో నన్ను అక్కడ నుండి పిలుస్తుంది. మరి వెళ్ళాలి కదా! వెళ్ళేవరకు ఉందావిడ పాపం.. వెళ్ళి తీర్థం ఇచ్చాను. "ఏమే అమ్మా! ఎత్తుకుంటావటే

నన్ను? నేను వచ్చాను" అన్నాను. నన్ను చిన్నప్పుడు ఎత్తుకుని మోసారు వీళ్ళందరూ. 'నేను వచ్చాను' అంటే పక్కవాళ్ళు కూడా బాబూజీ వచ్చారు చూడు అన్నారు. వెంటనే కళ్ళు తెరచి చూసింది. కొంచెం తీర్థం ఇచ్చాను. ఇచ్చాక చక్కగా అలా నావైపు చూసి, దీర్ఘ శ్వాస తీసుకుని అప్పటివరకు ఎవరి వంక చూడక కోమాలో ఉన్నది. అందరం ఓం బాబు ఓం బాబు అని నామం చేస్తుంటే దీర్ఘ శ్వాస తీసుకుని తృప్తిగా ప్రాణం వదిలింది. డాక్టరుగారు రాను చూడను.... ఇంకా ఉందా? ఈపాటికి వెళిపోతుందనుకున్నాను అని 'ఏమయ్యా! బాస్కరరావు నీవు కొంచెం ధైర్యంగా ఉండు అనేవారు. సరే ఇది అయిపోయింది. అయిపోయిన తరువాత వీళ్ళంతా అయిపోయింది అయిపోయింది అంటున్నారు. మనం కాదు అనటం. డాక్టరుగారిని పిలవండి. ఆయన ముద్ర వేయాలి అన్నాను. మళ్ళా ఎక్కడో ఉన్న ఆయన వచ్చి చేయి చూశాడు. ఆయన డాక్టరు అని తెలియదు నాకు. ఆయన నాకు చేయి అందిచ్చారు. భగవానుడికి చేయి అందిచ్చడమేమిటి? నాకు ఇప్పుడు కూడా అనిపిస్తుంది. ఆయన చేయి ఇస్తే ఇచ్చాడు. నేను ఎందుకు ఇచ్చాను అని. నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి 'ఆ! అయిపోయింది. మీ అమ్మగారు రాబట్టి సరిపోయిందయ్యా! లేకపోతే అలా కొట్టుకుంటూ ఉండేది' అన్నారు. దగ్గరి వాళ్ళు అందరూ 'బాబోయ్ చూడలేక పోయామమ్మా ఆవిడ ప్రాణంతో కొట్టుకుంటూ ఉంటే' అన్నారు. అందరూ తృప్తి పడ్డారు. నాకూ తృప్తిగా ఉంది. ఆనందంగా ఆ భక్తురాలు ఆమె కార్యక్రమం జరిపించుకుంది.

ఇదంతా వాడి చేతిలో ఉంది. మనం పోవాలంటే పోతుందా, పోదు. ఉండాలంటే ఉంటుందా, ఉండదు. అంటే మన తాళాలు వాడి చేతిలో ఉన్నాయి. ప్రణాళిక భగవంతుడిది. ఒక అవ్యక్తమైన శక్తి, ఒక సృష్టికి అవ్యక్తాన్ని గుర్తించటానికి వ్యక్తంగా పంపించింది మనను. ఈ వ్యక్తం లేకపోతే అవ్యక్తాన్ని మనం గుర్త్తించలేము. మీ ఇంటికి కరెంటు పెట్టుకున్నారా అంటే ఆయన 'లైట్లు లేవండీ, ఇల్లంతా వైరింగ్ చేయించాము కొత్త ఇల్లు' అన్నాడు. కనెక్షన్ కూడా ఇచ్చేశారా అని అడిగితే 'ఇచ్చేశామండీ' అన్నారు రామకృష్ణయ్యగారు. బేస్‌మెంట్‌లోకి వచ్చాము. అక్కడంతా చీకటిగా ఉంది. 'ఏమయ్యా వైరింగ్ చేయించాను అన్నావు కదా! మరి చీకటిగా ఉంది ఏమిటంటే, అక్కడ వైర్లలో కరెంటు ఉందిగాని బల్బులు లేవు. ఉపయోగించుకోవటానికి ఉపాధులు కావాలి. ఆ ఉపాధులు దానిని టచ్ చేయాలి. మళ్ళీ అది కూడా లూజ్ కనెక్షన్

గనుక ఉంటే అది వెలగదు. కరెంట్ ఉందో లేదో తెలియదు. అప్పుడు ఏం చేస్తాం? పక్కఇంట్లో కరెంట్ ఉందో లేదో చూస్తాం. పక్క ఇళ్ళలో కూడా లేకపోతే అమ్మయ్య! అయితే పరవాలేదు అనుకొంటాం. మన స్వభావాన్ని చూస్తే మనకే సిగ్గేస్తుంది. మనకొక్కడికే పోతే బాధ. అందరికీపోతే బాధ లేదు. స్వార్థపూరితమైన జీవితమంటే మానవునిదే. ఇంక సృష్టిలో ఏ ఒక్కరికీ లేదండీ. మానవుడేం చేస్తాడు? ఉన్నదానిని దాస్తాడు. పశువులు, పక్షులు ఉన్నది ఉన్నట్లు తింటాయి. వాటికి ఉప్పు, కారాలు అక్కరలేదు. పులుపులు అక్కరలేదు. ఫుడ్ స్టోర్స్ అక్కరలేదు. బ్యాంక్ బ్యాలన్స్లు అక్కరలేదు. మనమో! ఏదైనా ఉన్నదంటే దానిని మార్చిగాని తినం. యాపిల్ ఉన్నదున్నట్లు తినం.దానికి ఉప్పు, కారం చేర్చి, కాస్త  నిమ్మకాయ పిండి, చట్నీతో తింటాం. జామకాయలను ముక్కలుగా కోసి ఉప్పు, కారం అద్దుకొని తినటం ఒక ఫాషన్ అయిపోయింది. ఈ ముక్కలు కడుపును పాడుజేస్తాయి. ఉట్టిజామకాయ ముక్కలు కోసుకుతింటే అవి కడుపును పాడుచెయ్యవు. నీవు విచ్చలవిడిగా మానసిక సంకల్పాలవైపు పరిగెడుతున్నావు. తిన్నవి అరగకపోతే గ్యాస్ అవుతుంది. జీవితాన్ని ఇలా గడపటమేనా? ఒకసారి ఆలోచించండి. ఈ చరించే దానిలో ఒక భగవచ్ఛక్తి ఉంది అని తెలిసికొని దానిని పొందటానికి ప్రయత్నించటమా? దానికి మన భోగభాగ్యాలు, డాలర్లు అవసరంలేదు. బ్యాంక్ బ్యాలెన్స్తో అసలు పని లేదు. నీవు ఏ పని చేస్తున్నావో దానిని పవిత్రమైన అంతఃకరణతో చెయ్యి. అంతఃకరణ అంటే ఏది?  నువ్వు ఏదైనా ఒక మంచిమాట చెబితే అది మనః పూర్వకంగా చెప్పావా?హృదయంలోనుంచే వస్తున్నాయా.ఆ  మాటలు?భగవంతుడు మన హృదయంలో ఉంటానని మాట ఇచ్చాడు. అంటే మన మనస్సును పవిత్రం చేసికొందాం. మనస్సును ఎందులో వేసి ఉంచితే అలా ఊరుతుంది. శనగగింజనుగాని,ఆలివ్నుగాని నిమ్మరసంతో ఉంచితే పుల్లగా అవుతుంది. పంచదారపాకంలో ఉంచితే తియ్యగా ఉంటుంది. వేపరసంలో వేస్తే చేదుగా ఉంటుంది - అని శ్రీ గురుదేవులు చెప్తూ ఉండేవారు. అది ఆలివ్ స్వభావం కాదు. మరి దేని స్వభావం? అది ఉన్న సంఘం యొక్క స్వభావం. అలాగే మన మనస్సును దేనిలో ఊరవేస్తే దాని స్వభావం వస్తుంది. మీరు విడిచిపెట్టకుండా టి.వీ చూడండి. మనస్సు దానిలో ప్రసారమయ్యే దాంట్లో ఏదో ఒకటి కాచ్ చేస్తుంది.అధిదైవత్యం  పట్టవచ్చు. గురుతత్త్వం పట్టవచ్చు. హీరోగా అయినా అవవచ్చు. లేకపోతే విలన్గా తయారవచ్చు. దృశ్య

ప్రపంచంలోలాగా వినికిడికూడ. వినగా వినగా ఏమయి పోతుంది? వినికిడి ద్వారా, దృష్టి ద్వారా, రూపం ద్వారా మన మనస్సులో కదిలికలు వస్తాయి. తత్తిమా ఇంద్రియాలకు పెద్దగా లోబడదు మనస్సు. మనకొచ్చే బాధలు, సుఖదుఃఖాలు అన్ని కూడా చెవులద్వారా, కళ్ళద్వారానే వస్తాయి. అందుకని మనకు శాంతి మంత్రంగా కూడా భగవంతుడు చెప్పాడు.

**భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః**
**భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః**
**స్థిరైరంగైః తుష్టువాగ్ంం సస్తనూభిః**
**వ్యసేమదేవ హితం యదాయుః**
**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః**
**స్వస్తినః పూషా విశ్వవేదాః**
**స్వస్తినః తార్క్ష్యో అరిష్టనేమిః**
**స్వస్తినో బృహస్పతిర్దధాతు ॥**
**ఓమ్ శాంతిః శాంతిః శాంతిః ॥**

భద్రం కర్ణేభిః - చెవులు భద్రంగా ఉండాలి. ఏమైనా వినండి. మన ప్రార్థనలో 'ఇతరులయందు మంచినే చేయుటకు, ఇతరులయందు మంచినే చూచుటకు, మంచినే గ్రహించుటకు అని ఉంది. అలాగే మంచినే ఆలోచించుటకు - ఇవన్నీ ఎందుకు వచ్చాయి? మంచినే వినాలి. ఎవరైనా మనకు కాని శబ్దాలు మాట్లాడుతుంటే వినమని చెప్పలేదు.

**ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్ ।**

మనల్ని మనం ఉద్ధరించుకోవాలి. ఎవరినీ ఎవరూ ఉద్ధరించలేరు. కానీ నిర్ణయం తీసుకోవలసింది మన మనస్సే. చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు. ఇది గాంధీ మహాత్ముడి సూక్తి. కాబట్టి మంచినే వినాలి. ఫ్రిజర్‌లో ఏ ఆకారంలో పాలు పోసి పెడితే అదే ఆకారంలో బయటకి వచ్చినట్లు మన మనస్సు కూడా మన నడవడిని బట్టి అదే విధంగా మారుతుంది.

మన జీవితం ఆనందదాయకం అయినటువంటిది. దుఃఖపూరితం ఏనాటికీ కాదు. దుఃఖం నీవు తెచ్చుకుంటున్నాను అని అనుకుంటున్నావు. నేను, నాది అనే అహంకార మమకారాల ద్వారా మనం దుఃఖాన్ని పొందుతున్నాము. రాత్రింబవళ్ళ లాంటివి సుఖదుఃఖాలు. పగలువస్తే వెలుగు. రాత్రి వస్తే చీకటి. ఒక్కొక్క సమయంలో చీకటి ఎక్కువగా ఉంటుంది. అబ్బ!

ఎప్పుడు ఎండ వస్తుందా? అనిపిస్తుంది. ఇంట్లో కరెంట్ ఉంది కదా! బయట చీకటిగా ఉంటే మాత్రం ఏమిటట? కాని మనస్సుకు డిప్రెషన్ లాగా ఉంటుంది. ఔనా? బయట నెమ్మగా ఉంటే మనస్సుకూడ నెమ్మగా ఉంటుంది. అందుకనే సూర్యకాంతి ఎంతగొప్పది? అది ఆరోగ్యప్రదం. బయటకు వెళ్ళి సూర్యకిరణాలు ఒంటిమీద పడితే మంచిది కదా అనుకొంటాము. అందుకే అమెరికన్లు సముద్రపుఒడ్డున ఎండలో వస్త్రాలన్నీ తీసివేసి కూర్చుంటారు.

భగవంతుడు ఒక్కొక్కరికీ ఒక్కొక్కటి ఇస్తాడు.కాని దానిని గుర్తించటంలో ఉంటుంది. అంటే మళ్ళీ గుర్తింపు దగ్గరకు వచ్చాము. ప్రతి కదలికలోను గుర్తింపు. ఒకావిడకు చాలా నగలు ఉన్నాయి. కాని ఆరోగ్యం సరిగ్గా లేదు. ముందు తను బాగుండాలి కదా. ఇప్పుడు అన్నిటికీ భయమే. ఆమె బయటకు వచ్చేటప్పుడుఅన్ని నగలు ఉన్నా రోల్డుగోల్డు నగలు పెట్టుకొస్తుంది? ఎందుకంటే దొంగల భయం. డాలర్లు ఉన్నా భయమే. లేకపోయినా భయమే. అన్నీ బాధలే. జీవితంలో పరమైనదంతా బాధే. కాని తనదైనదొక్కటే నిజమైన సుఖాన్ని ఇస్తుంది. అది ప్రసాదించేవాడు భగవంతుడొక్కడే. మన గురునాధుడొక్కడే. కాబట్టి కరెంటు ఉందా లేదా అని తెలిసికోవటానికి మనకు ఉపాధులు కారణం ఎలా అయ్యాయో, అలాగే అనంతంగా ప్రకాశిస్తున్న ఆత్మస్వరూపానికి మనకు ఈ ఉపాధి ఒకటి ఇచ్చాడు. ఇచ్చి ప్రతి విషయంలోను మంచిని సేకరించుకొంటూ, ఏది ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉండాలి. జగత్తు మనది. మన స్వరూపం సుఖం. మన స్వరూపం ఆనందకరమైనది. కాని దానిలో మనస్సు చేరి, దానితోవచ్చే సహవాస దోషం చేత దుఃఖం వస్తోంది. కాబట్టి ఎప్పటికప్పుడు అవగాహన చేసికొంటూ మనకున్న జీవితంలో ప్రశాంతత అనే మన సహజ లక్షణాన్ని గుర్తించాలి. డబ్బు ఖర్చు పెడితే బయట పదార్థాలు వస్తాయి. కాని ఖర్చు పెట్టకుండా వచ్చేది కూర్చుని విచారణ చేయటంవల్లనే. మనం నిద్ర పోవటానికి ఏమైనా ఖర్చు పెడుతున్నామా? ఆకలి వేస్తే తినటానికి డబ్బు కావాలి. కాని నిద్రకు డబ్బు అక్కరలేదు. అంతే కాదు నిద్రలో హాయి ఉంది. నిద్రనుంచి లేచాక ఫ్రెష్‌గా ఉంటారు.అలా ఫ్రెష్‌గా ఉంటే ఒక ప్రశాంతత మనస్సుకు కలిగిస్తుంది. అలాంటి విశ్రాంతి మనం జాగ్రత్తులో ప్రతి విషయాన్ని పరిశీలిస్తూ ఉంటే లభిస్తుంది.

-సశేషం




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"శ్యమంతక ప్రాప్తి ముఖ్యమే కృష్ణా!" యాదవ పరివారం ఈ విధంగా ధన సమృద్ధికోసం హత్యలు చేయటం వల్ల శాసనం ఛిన్నాభిన్నం అవుతుంది. శతధన్వునికి శాసనీయ దండన విధించటంలోనే సమాజ కళ్యాణం ఉంది" అన్నాడు వరిష్ఠ యాదవులు.

కృష్ణుడు సమ్మతి సూచకంగా తల ఊపాడు. శతధన్వుడు ఎక్కడికి వెళ్ళగలడు!

గ్రామాలలోనో, నగరాలలోనో.... పర్వతాలలోనో దాగి ప్రాణరక్షణ చేసికొంటూ తిరుగుతున్నాడు..... కృష్ణబలరాములు తనని పట్టుకొని మృత్యుదండన వెయ్యటానికి తనకోసం వెతుకుతున్నారని తెలిసింది శతధన్వునికి. అతనికి దాక్కోవటం కఠినమైంది.... అడుగు ముందుకు పడటం లేదు. ఏ గుహలోనో ,చెట్లకొమ్మల చాటునో దాక్కుంటున్నాడు. రథం, అశ్వాలు ఎప్పుడో తన దగ్గర లేకుండాపోయాయి. అడుగు వేయటం కష్టంగా ఉంది....

శతధన్వుని రథం, అశ్వాలు.... మార్గంలో చూచి కృష్ణుడు ఆగిపోయాడు. "అన్నగారూ! శతధన్వుడు ఈ మార్గంలోనే ఎక్కడో కాలినడకన పరిగెడుతున్నాడు. రథారూఢులమై మనం శతధన్వుని పట్టుకొని దండించటం ధర్మం కాదు. మనం కూడా రథములు వదిలి వెతుకుదాము" అన్నాడు కృష్ణుడు బలరామునితో.

"జనార్థనా! నీ మాటలు సముచితంగా ఉన్నాయి. కాని ఈ అపరిచితమైన చోట విలువైన ఈ రథాశ్వాలను వదలి కాలినడకన వెళ్తే... వాటిని ఎవరైనా తీసుకువెళ్ళవచ్చు కదా!"

"అయితే అన్నగారూ! మీరు ఈ సమీపంలోనే జనపదంలో వేచి ఉండండి నేను వెళ్ళి శతధన్వుని వెతుకుతాను" అన్నాడు కృష్ణుడు బలరాముని సమాధాన పరుస్తూ.....

బలరాముడు అలాగే చేశాడు... కృష్ణుడు పర్వతాలలోని జనం నడిచే దారిలో ముందుకు సాగాడు.

కొంచెం దూరం వెళ్ళగానే శతధన్వుని జాడలు కనిపించసాగాయి.... ఇది అతని ఆఖరి ఘట్టం... కృష్ణుడు అతనిని పట్టుకుంటే వదిలిపెట్టడు... అందుకని కృష్ణుని ఎదుర్కోవటమే ఏకైక మార్గం అని నిశ్చయించుకున్నాడు శతధన్వుడు. ఒకరికొకరు ఎదురుపడ్డారు..... శతధన్వుని కనులలో భయం.... కృష్ణుని కనులలో కరుణ... కృష్ణుని పెదవులపై అదే భువనమోహనమైన మందహాసం వెల్లివిరుస్తోంది.... శతధన్వునికి తన అంతిమకాలం సమీపించిందని భావిస్తున్నాడు. అతను కళ్ళుమూసుకున్నాడు... కాని అతను ఏది అనుకున్నాడో అది జరగలేదు... తనని చంపటానికి ఎత్తిన శస్త్రంఆగిపోయింది... ఎందుకని?... కృష్ణుడు క్షణకాలం ఆగాడు... ఆ తరువాత శస్త్రం తన పనిని చేసింది...

శతధన్వుని తల విచ్ఛిన్నమై ధరాతలంపై పడింది. ఎన్నిరోజులుగానో పరిగెత్తి పరిగెత్తి అలసిన దేహానికి శాశ్వత విశ్రాంతి లభించింది. కృష్ణుడు నెమ్మదిగా అతనిని సమీపించాడు.... పక్కన ఉన్న లత లోనుంచి ఒక వికసిత పుష్పాన్ని తీసుకొని శతధన్వుని పాదాలపై ఉంచాడు... తులసీదళాన్ని అతని నోటివద్ద ఉంచాడు... అతనికి ప్రదక్షిణ చేసి వందనం చేశాడు... ప్రక్కనే పారుతున్న జలధారలనుంచి అంజలితో నీరు తెచ్చి అర్ఘ్యం ఇచ్చి అతని పంచభూతాలకు శాంతిని ప్రసాదించాడు.

అపరాధి దండన పొందాడు... కాని ఆ మణి?... దాని జాడ ఎక్కడా లేదే! అతని వద్దా దొరకలేదు. కృష్ణుడు చింతాక్రాంతుడైనాడు.

'అన్నగారూ!' కృష్ణుడు బలరామునితో జరిగినదంతా వివరిస్తూ ఇలా అన్నాడు "అపరాధి దండింప బడ్డాడు. కాని శ్యమంతకమణి దొరకలేదు... అతని దగ్గర లేదు."

అది ఎలా సంభవం? బలరాముడు ఆశ్చర్యచకితుడైనాడు. శతధన్వుడే దొంగ, మణి అతని వద్దే ఉండాలి." కాని అతని వద్దలేదు" సత్రాజిత్తుని హత్యచేసింది శతధన్వుడే అన్నది నిర్వివాదాంశం..." అన్నాడు కృష్ణుడు.

కాని శ్యమంతకమణి అతడే తీసుకున్నాడన్నది కూడా నిర్వివాదాంసమే కదా కృష్ణా!""అవును అది నిర్వివాదమైన విషయమే... కాని ఇప్పుడు ఆ మణిని వద్దన లేదన్నది కూడా సత్యమే కదా....." అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా!" బలరాముడు ఒక నిశ్చయానికి వచ్చినవాడై అన్నాడు.

-సశేషం

## భాష్పాంజలి



గురుసోదరులు, సమర్థ సద్గురు మాస పత్రికకు గౌరవ సంపాదకులు శ్రీ శివరామ ప్రసాద్‌గారు, ది.24.8.2010 మంగళవారంనాడు గురుసాయుజ్యాన్ని పొందారు. వీరు సమర్థ సద్గురు మాస పత్రికను అత్యంత రమణీయంగా తీర్చి దిద్దటమే కాక ఆశ్రమానికి అనేక సేవలను అందించినారు. వీరి వయస్సు 74 సంవత్సరములు. వీరికి ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు కలరు. శ్రీ గురుదేవులు వారి కుటుంబ సభ్యులకు మనోస్థైర్యమును, మనఃశాంతిని ప్రసాదించెదరు గాక.

## స్మృత్యంజలి

గురుసోదరి శ్రీమతి కునాధరాజు కమలమ్మగారు(పాందువ్వ) ది.25.8,2010 బుధవారము నాడు గురు సాయుజ్యమును పొందినారు. వీరి వయస్సు 65 సంవత్సరములు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. వీరు అస్వస్థులై, వీరి భర్తగారైన శ్రీ గోపాలరాజుగారితో కొంతకాలంగా ఆశ్రమంలో ఉంటున్నారు. శ్రీ గురుదేవులు వారి కుటుంబ సభ్యులకు ఆత్మ శాంతిని ప్రసాదించెదరు గాక.

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,